మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 16-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 107 Issue: 107

16 అక్టోబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 5:50 తిథి దశమి ఉ. 10:38 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష మ. 12:41 వరకు తరువాత మఖ యోగం శుభ రా. 2:04 వరకు కరణం విష్టి ఉ. 10:38 వరకు బవ రా. 10:53 వరకు వర్జ్యం రా. 1:20 నుండి తె. 3:01 వరకు దుర్ముహూర్తం ఉ. 10:05 నుండి ఉ. 10:51 వరకు మ. 2:44 నుండి మ. 3:30 వరకు రాహుకాలం మ. 1:28 నుండి మ. 2:55 వరకు యమగండం ఉ. 6:13 నుండి ఉ. 7:40 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 11:03 నుండి మ. 12:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:24 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


# తిండెక్కువైంది!

## ఏటా 55 కిలోల ఆహారం పడేస్తున్న ఒక్కో భారతీయుడు

ఆహారాన్ని వృథా చేస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానం.. తొలి స్థానంలో చైనా.. ఆరో స్థానంలో అమెరికా

తాజా సర్వేలో భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి.. నేడు ప్రపంచ ఆహార దినోత్సవం





ప్లేట్ నిండా అన్నం, కూరలు నింపుకోవడం.. కడుపు నిండగానే మిగిలినదంతా పడేయడం.. ఎందుకు పడేస్తున్నావంటే..? కడుపులో పట్టకపోతే చీరి పెట్టుకొమ్మంటావా? అని వెటకారం. ముఖ్యంగా పెళ్లిల్లో కనిపించే దారుణ వాస్తవాలివీ. ఒకసారి ప్లేట్ పడితే చాలు.. 15, 16 రకాల ఆహార పదార్థాలు ప్లేట్ నిండా పెట్టుకొని, అలా.. అలా.. రుచి చూసి డస్ట్ బిన్‌లో పడేసే మహానుభావులున్నారు. పైగా, దాన్ని ఫ్యాషన్ అనుకునే తిక్క కూడా ఉంది కొందరికి. అలా ఆహారాన్ని ఎంతలా వృథా చేస్తున్నారో తెలుసా.. ఏడాదికి ఒక్కో భారతీయుడు 55 కిలోల ఆహారాన్ని పడేస్తున్నాడట.

2




# నా తొవ్వ..

"ఇంకా 'గులాబీ' చెట్టు కింద ఉండలేను

'జాగృతి జనం బాట' పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు కవిత ఉంటామన్నారు. కేసీఆర్ ఫొటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫొటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. 'నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా' అని అన్నారు.

# జనం బాట

కేసీఆర్ ఫొటో పెట్టుకోవడం నైతికత కాదు

అందుకే ఆయన ఫొటో తొలగించా

జయశంకర్ సార్ ఫొటో వాడుతా

తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత

జాగృతి జనంబాట పోస్టర్ ఆవిష్కరణ

25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా యాత్ర

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫొటో పెట్టలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫొటో పెట్టామన్నారు. బుధవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాగృతి జనం బాట యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. త్వరలోనే తాను చేపట్టనున్న ప్రజాయాత్రకు సంబంధించిన పలు వివరాలను ఆమె పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ కుట్రలు!

## బీసీలను తొక్కేస్తున్నారు

కొండా సురేఖ కూతురు సంచలన ఆరోపణలు

బుధవారం రాత్రి ఆమె ఇంటి వద్ద హైడ్రామా

ఓఎస్డీ కోసం మఫ్టీల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు



జూబ్లీహిల్స్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద బుధవారం రాత్రి హైడ్రామా చోటుచేసుకుంది. మంత్రి ఇంటికి వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మఫ్టీలో వచ్చారు. మంత్రి సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిన్న విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో అతని కోసం వరంగల్ పోలీసులు నిన్నటి నుంచి గాలిస్తున్నారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో అతని కోసం మంత్రి ఇంటికి పోలీసులు వచ్చినట్లు సమాచారం. అయితే కొండా సురేఖ కుమార్తె సుస్మిత మఫ్టీలో వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిని గుమ్మంలోనే నిలబెట్టి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. మంత్రి కొండా -2 వ పేజీలో...



# జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించింది భారతీయ జనతా పార్టీ. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షునిగా ఉన్న లంకల దీపక్ రెడ్డిని ఎంపిక చేసింది పార్టీ హైకమాండ్. అభ్యర్థి ఎంపిక విషయంలో ఇద్దరి ముగ్గురి పేర్లు పరిశీలించినా.. ఫైనల్ గా దీపక్ రెడ్డి వైపే మొగ్గు చూపింది. లంకల దీపక్ రెడ్డి.. 2023 ఎన్నికల్లోనూ ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో ఆయన 25 వేల ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేస్తుండగా.. - 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,944 |
| వెండి (గ్రాము): | రూ.207 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,681 |



2

# కేటీఆర్ డ్రగ్స్ సప్లయర్

జూబ్లీహిల్స్ క్లబ్బులకు మత్తు పదార్థాల సప్లై

రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోంది

నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సంచలన ఆరోపణలు

# మంత్రుల ఓవరాక్షన్.. రేవంత్ యాక్షన్!

అమాత్యుల కొట్లాటలపై సీఎం సీరియస్

సర్కారు ఇమేజ్ డ్యామేజీ చేస్తున్నారని ఫైర్

ఇగో వదలకపోతే ఉన్న పోస్టు ఊడుతుంది

వివాదాస్పద మంత్రులకు సీఎం రేవంత్ క్లాస్!?



2

అడ్లూరి లక్ష్మణ్ వర్సెస్ పొన్నం ప్రభాకర్
అడ్లూరి లక్ష్మణ్ వర్సెస్ వివేక్ వెంకటస్వామి
కొండా సురేఖ వర్సెస్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
కొండా సురేఖ వర్సెస్ నాయిని రాజేందర్ రెడ్డి
మందుల సామేల్ వర్సెస్ బీర్ల ఐలయ్య
డాక్టర్ సంజయ్ కుమార్ వర్సెస్ జీవన్ రెడ్డి

.........

ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పార్టీ నిత్యం వివాదాలతో రగిలిపోతోంది. ఈ వివాదాలు పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. దీంతో సీఎం రేవంత్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సర్కారు ఇమేజ్ డ్యామేజ్ చేస్తే యాక్షన్ తప్పదని, ఇక అంతా క్రమశిక్షణ పాటించాల్సిందేనని, ఓవరాక్షన్ చేస్తే, చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.





2

# మాగంటి సునీత నామినేషన్

వెంట కేటీఆర్, పార్టీ ముఖ్యనేతలు

## విశ్వవాణి



మనసు ఆగమైతుందా..? అయితే రోజులు నాలుగు సార్లు హగ్స్ ఇచ్చుకుంటే ఆ బాధ తీరిపోతుందని తాజా అధ్యయనం చెప్తోంది. ఆందోళన, ఒంటరితనం, తీవ్ర ఒత్తిడితో బాధపడేవారు ఇష్టమైనవారిని రోజులు నాలుగైదుసార్లు ఆలింగనం చేసుకుంటే ఆ బాధంతా పోతుందట.



# మల్లోజుల సరెండర్

మహారాష్ట్ర సీఎం ఎదుట లొంగుబాటు

తన బృందంలోని 60 మంది కూడా

54 ఆయుధాలను అప్పగించిన నక్సల్స్

ఛత్తీస్‌గఢ్‌లో మరో 27 మంది లొంగుబాటు

గడ్చిరోలి, అక్టోబర్ 15 (ఈవార్తలు): మావోయిస్టు పార్టీ అగ్రనేత, దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 60 -2 వ పేజీలో...

# ఆశన్నా.. జనంలోకి!

## నేడు పోలీసుల ఎదుట లొంగుబాటు

వనాన్ని వీడుతున్న మావోయిస్టు పార్టీ అగ్రనేతలు



హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరిగా వనాన్ని వీడి జనంలోకి వస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు.. పార్టీకి చెందిన 60 మంది ముఖ్య సభ్యులు, కార్యకర్తలతో కలిసి లొంగిపోగా, తాజాగా.. మరో కీలక సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేశ్ సైతం గురువారం ఛత్తీస్‌గఢ్ సీఎం తరువాయి 2 వ పేజీలో...




2

# రూ.1కే 2 జీబీ డేటా

అపరిమిత కాల్స్ కూడా

బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్

# 12 నెలలు ఉద్యోగం లేకపోతేనే..!

పీఎఫ్ మొత్తం విత్‌డ్రాకు అవకాశం

ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలు

కేంద్రంపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

2

## రాశి ఫలాలు

15.10.2025

మేషం: సంతానం కొన్ని విషయాలలో మీమాటతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు తప్పవు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. ప్రారంభించిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు.

వృషభం: ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. వ్యాపార ఉద్యోగాలు నిలకడ లోపిస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి.

మిధునం: పాత ఋణాలు కొంత వరకు తీరుస్తారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. కుటుంబ సభ్యుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది. నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు పొందుతారు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిదికాదు.

కర్కాటకం: కొన్ని వ్యవహారాలలో ఇంటా బయట సమస్యలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఉద్యోగమున కీలక నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత బాధ కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు.

సింహం: స్థిరాస్తి వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వ్యాపారమున అప్పుల నుంచి పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి. ఆకస్మిక ధన లబ్ది పొందుతారు. పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి.

కన్య: ధన వ్యవహారాలలో లోటుపాట్లు ఉంటాయి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. భాగస్వామ్య వ్యాపారాలు మందగిస్తాయి.

తుల: సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి. కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. దూర ప్రాంతాల బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలులో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తవుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఆర్థిక ఇబ్బందుల వలన శిరో బాధలు పెరుగుతాయి. అకారణంగా కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ యత్నాలు అంతగా కలిసిరావు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చెయ్యడం మంచిది. కుటుంబ వాతావరణం మరింత చికాకు కలిగిస్తుంది.

కుంభం: సమర్థవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. వ్యాపారము నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. దీర్ఘ కాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు.

మీనం: సన్నిహితుల సహాయ సహకారములతో నూతన కార్యక్రమములు ప్రారంభిస్తారు. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి.

# నా తొవ్వ.. జనం బాట

**మొదటి పేజీ తరువాయి**

నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, తన భవిష్యత్ ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడిన కవిత.. ఒక పార్టీకి కేసీఆర్ అధ్యక్షుడు అని.. ఆ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేశారని.. అందుకే ఆయన ఫోటో పెట్టుకుని యాత్ర చేయడం నైతికంగా సరైంది కాదని పేర్కొన్నారు. అందుకే కేసీఆర్ ఫోటో కాకుండా తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోలతో ఈ జాగృతి జనం బాట యాత్ర కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తన తండ్రి అని.. ఆయన కడుపున పుట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. అదే సమయంలో కేసీఆర్ ఫోటోను యాత్రలో ఉంచడం తన నైతిక విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈనెల 25వ తేదీన ప్రారంభం కానున్న ఈ యాత్ర.. ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. మరోవైపు.. గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతిపై స్పందించిన కవిత.. జాగృతి ఏర్పాటు చేసినప్పుడు కేసీఆర్ ఆలోచనలు లేకుండానే ప్రారంభించామని తేల్చి చెప్పారు. తాను బీఆర్ఎస్‌లో చేరినపుడు మాత్రమే కేసీఆర్ ఫోటోను ఉంచానని.. తెలిపారు. భౌగోళిక తెలంగాణను సాధించాం కానీ.. ఇంకా సామాజిక తెలంగాణ సాధించలేదని తాను చెప్పానని.. ఆ మాటల కారణంగానే తనను పార్టీ నుంచి వెళ్లగొట్టారని కవిత ఆరోపించారు. సామాజిక తెలంగాణ కోసం తాను అప్పుడు పోరాడానని.. ఇప్పుడు కూడా పోరాడతానని స్పష్టం చేశారు. ప్రజలే తన గురువులని.. అందుకే ప్రజల దగ్గరికి వెళ్లాలని తాను నిర్ణయం తీసుకున్నట్లు కవిత వివరించారు. హైదరాబాద్‌లో కూర్చొని జిల్లాల్లో నెలకొన్న సమస్యల గురించి మాట్లాడటం సరైంది కాదని.. అందుకే ప్రతీ జిల్లాలో జాగృతి జనం బాట పేరుతో 2 రోజులపాటు యాత్ర చేస్తానని తెలిపారు. నాలుగు నెలలపాటు ఈ జాగృతి జనం బాట యాత్ర కొనసాగుతుందని కవిత వివరించారు. యాత్రలో అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు చాలా తెలివైన వాళ్లని.. వారికి అన్నీ తెలుసని పేర్కొన్నారు. తెలంగాణ యువత, మహిళలను మరింత చైతన్యవంతులను చేస్తామని వెల్లడించారు. మరోవైపు.. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రంలోని ఏ వర్గం కూడా సానుకూలంగా లేదని విమర్శలు చేశారు. ప్రజల సమస్యలు పక్కనపెట్టి.. ప్రతిపక్షాలను వేధించే పనిలోనే ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమై ఉందని కవిత ఆరోపించారు. దీంతో ఇప్పుడు తెలంగాణలో అనిశ్చితి వాతావరణం నెలకొందని మండిపడ్డారు.

## మంత్రుల ఓవరాక్షన్.. రేవంత్ యాక్షన్!

### వివాదాస్పద మంత్రులకు సీఎం రేవంత్ క్లాస్!?

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో మంత్రుల మధ్య కొట్లాటలు.. ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి పరువు సమస్యగా మారాయి. రెండేళ్లైనా నిండక ముందే మంత్రులు గొడవలకు దిగడం సర్కార్ ఇమేజ్‌కు డ్యామేజ్ చేస్తోంది. అమాత్యుల గిల్లి కజ్జాలపై సీరియస్‌గా ఉన్న సీఎం రేవంత్..మంత్రులను గాడిన పెట్టడంపై దృష్టి పెట్టారట. మొన్న పొన్నం, అడ్లూరి..నిన్న కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..ఇప్పుడు వివేక్ ఎంట్రీతో..అడ్లూరితో వివాదంపై రచ్చ జరగడంతో రేవంత్ స్వయంగా రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టారట. రోజుకో ఇద్దరు మంత్రుల వివాదం న్యూస్ హెడ్‌లైన్‌గా మారి ప్రభుత్వానికి హెడెక్‌గా మారిందట. పైగా డైరెక్టుగా అధిష్టానం పెద్దలకే ఒకరిపై మరొకరు కంప్లైంట్ చేసుకుంటుండటం కూడా ప్రభుత్వాన్ని బజారున పడేస్తుందన్న భావనలో ఉన్నారట సీఎం రేవంత్. ఈ క్రమంలోనే కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఉంటున్న మంత్రుల తీరుపై ఆగ్రహంగా ఉన్న సీఎం.. తీరు మార్చుకోవాలని సూచించారట. మంత్రుల మధ్య అభిప్రాయ బేధాలు ఉంటే.. అంతర్గతంగా చర్చించుకోవాలని, మీడియాకెక్కి రచ్చ చేస్తుంటే ప్రభుత్వం పరువు పోతుందని మండిపడ్డారని తెలిసింది. ప్రతిపక్షాల ముందు చులకన కావొస్తుందని ఆగ్రహంతో చెప్పారట. మంత్రులకు అనుమానాలు, అపోహలు ఉంటే..నేరుగా తనతో మాట్లాడొచ్చని..అలా కాకుండా..ఒకరిని ఒకరు టార్గెట్ చేసుకోవడం ఏంటని..క్లాస్ తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు, వివాదాస్పద మంత్రులపై యాక్షన్ తప్పదని చెప్పకనే చెప్పారట. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తూ ఏదో ఒక వివాదంతో మీడియాకు ఎక్కుతున్న మంత్రులపై వేటు తప్పదని స్పష్టం చేస్తున్నారట. అందులో భాగంగానే వివాదాస్పద మంత్రుల శాఖలపై సీఎంవో నిఘా పెట్టిందట. ఈ క్రమంలోనే కొండా సురేఖ శాఖలోని ఓఎస్డీని తప్పించారని అంటున్నారు. కాంట్రవర్సీల్లో నిలుస్తున్న మంత్రులను కూడా తప్పించేందుకు కూడా వెనకాడబోమంటున్నారట. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న మిగిలిన మూడు పోస్టులు భర్తీ చేసేప్పుడు ఇప్పుడున్న క్యాబినెట్ మంత్రుల్లో కూడా మార్పులు చేర్పులు ఉంటాయట.

## రేవంత్ కుట్రలు!

**మొదటి పేజీ తరువాయి**

సురేఖ ఇంటికి మఫ్టీల్లో వెళ్లిన టాస్క్ ఫోర్స్ పోలీసులు.. ఆమె ప్రైవేటు ఓఎస్డీ సుమంత్ గురించి ఆరా తీశారు. కేసు వివరాలు ఏంటో చెప్పకుండా ఆయన్ని ఎలా అప్పగిస్తామని పోలీసులను కొండా సురేఖ కుమార్తె ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేసి అసలు కేసు ఏంటో చెప్పాలని నిలదీశారు. అక్కడే నిలబెట్టి ఏం జరిగిందో ఎందుకు ఆయన కోసం వెతుకుతున్నారో చెప్పాలని అడిగారు. కొండా సురేఖ ప్రైవేట్ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ప్రభుత్వం విధుల నుంచి తప్పించింది. ఆయన డెక్కన్ సిమెంట్ కంపెనీ ఫైల్ విషయంలో ఎవర్నో బెదిరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ప్రభుత్వ అతన్ని విధుల నుంచి తప్పించిందని అంటున్నారు. ఆ కేసులో విచారించేందుకు ఆయన్ని అదుపులోకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. సుమంత్‌ను విధుల నుంచి తప్పించిన తర్వాత ఆయన సురేఖ ఇంట్లో ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. అందుకే ఆయన్ని పట్టుకునేందుకు సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. అక్కడ ఉన్న సురేఖ కుమార్తె కేసు వివరాలు చెప్పకుండా సుమంత్‌ను అప్పగించడం కుదరదని చెప్పేశారు. చాలా సమయం పోలీసులు అక్కడ ఉండి తర్వాత వెళ్లిపోయారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన సురేఖ కుమార్తె సుస్మిత తాము కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నామా వేరే ప్రభుత్వంలో ఉన్నామా అని ప్రశ్నించారు. కేసు వివరాలు చెప్పకుండా తని కోసం ఎందుకు వెతుకుతున్నారని నిలదీశారు. అసలు పోలీసులు ఎవర్ని అరెస్టు చేయడానికి వచ్చారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న డెక్కన్ సిమెంట్ కంపెనీ ఫైల్ సుమంత్ బెదిరింపులకు పాల్పడ్డారని మంత్రి ఉత్తమ్ కుమార్ ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని మంత్రి కొండా సురేఖ కుమార్తెకు వివరించారు. దీనిపైనే తాము నేరుగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేస్తే ఆయన తాను అలా చేయలేదని చెప్పినట్టు సురేఖ కుమార్తె పేర్కొన్నారు. బీసీలను తొక్కేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. మొత్తం ఎపిసోడ్ వెనుక నరేంద్రరెడ్డి, కడియం శ్రీహరి, సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తం ఉందని సురేఖ కుమార్తె ఆరోపించారు. ఈ వివాదం నడుస్తున్న క్రమంలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమంత్‌ను తన కారులోనే బయటకు తీసుకెళ్లారు.

## మాగంటి సునీత నామినేషన్

జూబ్లీహిల్స్/షేక్‌పేట, అక్టోబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికల ప్రక్రియ వేడెక్కింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ముఖ్య నేతలతో కలిసి బుధవారం ఆమె షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తొలి సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ అత్యంత పట్టుదలగా ఉంది. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అక్టోబర్ 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 24వ తేదీ వరకు గడువు విధించారు. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## రూ.1కే 2 జీబీ డేటా

### అపరిమిత కాల్స్ కూడా.. బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్

న్యూఢిల్లీ: బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ప్రారంభించిన తర్వాత, తొలిసారి ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. కొత్త యూజర్లు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో కనెక్ట్ అవ్వాలనుకుంటే, కేవలం 1 రూపాయికి అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2జీబీ డేటా, 100 మెసేజ్‌లు లభించనున్నాయి. కంపెనీ ఫ్రీ సిమ్ కూడా అందిస్తోంది. ఈ ఆఫర్ కొత్త యూజర్ల కోసం మాత్రమే వర్తిస్తుంది. మీరు ఇతర నెట్‌వర్క్ యూజర్లు అయితే, ఈ కొత్త ఆఫర్ ద్వారా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి స్విచ్ అవ్వవచ్చు. అయితే, ఈ ఆఫర్ పరిమితి కాలం వరకే అందుబాటులో ఉంది. ఈ ఆఫర్ 15 అక్టోబర్ నుంచి 15 నవంబర్ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. పై సౌకర్యాలు 30 రోజుల పాటు లభిస్తాయి. ఆ తర్వాత మీరు మీకు అనుకూలమైన రీచార్జ్ ప్లాన్ ఎంచుకొని సేవ కొనసాగించవచ్చు. బీఎస్ఎన్ఎల్ ఈ ఆఫర్‌కు “దీపావళి బోనాంజా” అని పేరు పెట్టింది.

## 12 నెలలు ఉద్యోగం లేకపోతేనే..!

### ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలు.. కేంద్రంపై భగ్గుమన్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: ఈపీఎఫ్ఓకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ముందస్తు ఉపసంహరణలకు సంబంధించిన గడువును 2 నెలల నుంచి 12 నెలలకు పెంచడం, ఈపీఎఫ్ఓ మొత్తం ఉపసంహరణకు వేచి ఉండే కాలాన్ని కూడా 2 నెలల నుంచి 36 నెలలకు సవరించడం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వలు ఉండాలన్న నిబంధన తీసుకురావడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ కొత్త నిబంధనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈపీఎఫ్ఓ తీసుకువచ్చిన నిబంధనలు క్రూరమైనవని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ మాణికం ఠాగూర్ అన్నారు. పెన్షనర్లు, ఉద్యోగం కోల్పోయిన వారికి తమ పొదుపు సొమ్ము అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగం కోల్పోయిన వారు పీఎఫ్ నిధి కోసం ఇప్పుడు ఏడాది పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. ఇది సంస్కరణ కాదని, దోపిడీ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోదీ వెంటనే జోక్యం చేసుకుని సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్న మన్సుఖ్ మాండవీయను కట్టడి చేయాలని సూచించారు. ఒక ఉద్యోగి ఏదైనా కారణంతో ఉద్యోగం కోల్పోతే అతను బిల్లులు, ఈఎంఐలు ఎలా చెల్లిస్తారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ప్రశ్నించారు. ఏడాది తర్వాత నిధిని తీసుకున్న 75 శాతం మాత్రమే ఉపసంహరించుకోగలడని, మిగిలిన 25 శాతం కోసం పదవీ విరమణ వరకు వేచి చూడాలని వ్యాఖ్యానించారు. తమ నిధులను తీసుకోకుండా చేస్తే మధ్య తరగతి వ్యక్తి మనుగడ ఎలా సాగిస్తారని ఆయన నిలదీశారు.

## ఆశన్నా.. జనంలోకి!

**మొదటి పేజీ తరువాయి**

ఎదుట లొంగిపోనున్నారు. ఖమ్మం జిల్లా తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ఈ మావోయిస్టు నాయకుడు రాజకీయ, సైనిక విషయాల్లో నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన నేతృత్వంలో వివిధ స్థాయిల కేడర్లతో కలిపి సుమారు 70 మంది మావోయిస్టులు సరెండర్ కానున్నారు. ఆశన్న మావోయిస్టు ఉద్యమంలో 1990ల చివరలో చేరాడు .పార్టీలో నేగంగా ఎదిగాడు. కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. మావోయిస్టు పార్టీలో రాజకీయ వ్యూహాలు, సైనిక కార్యకలాపాలు, ప్రచార విషయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రెడ్ కారిడార్ ప్రాంతాల్లో ఆయన ప్రభావం ఎక్కువగా ఉందని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. సీపీఐ-మావోయిస్టు పార్టీలో ఆయన సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, దక్షిణ భారత జోనల్ కమిటీలో కూడా కీలకంగా ఉన్నారు. మావోయిస్టు ప్రచారాలు, రిక్రూట్‌మెంట్, ఫండ్ కలెక్షన్ విషయాల్లో నిపుణుడు. ఆయనపై కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల బహుమతి ప్రకటించింది. 2025 మేలో జనరల్ సెక్రటరీ బసవరాజు మరణం తర్వాత, కేంద్ర కమిటీలో కొత్త నియామకాలు జరిగినప్పుడు, ‘ఆశన్న’పై ఆసక్తి పెరిగింది. అయితే, పార్టీ ఆయనకు జనరల్ సెక్రటరీ పదవి ఇవ్వకపోవడంతో, ఆయనలో అసంతృప్తి పెరిగిందని ఇంటెలిజెన్స్ రిపోర్టులు తెలిపాయి. బదులుగా, మండవి హిద్మా మావోయిస్టు మిలిటరీ కమాండర్‌ను దక్షిణ బస్తార్ జోనల్ కమిటీ సెక్రటరీగా నియమించారు. ఈ నిర్ణయం తెలుగు కేడర్లలో ఆంధ్ర-తెలంగాణ నుంచి వచ్చినవారిలో అసంతృప్తిని రేకెత్తించింది, ఎందుకంటే ‘ఆశన్న’ రాజకీయ, సైనిక రెండు విషయాల్లోనూ సామర్థ్యవంతుడని ప్రచారం ఉంది. ఈ అసంతృప్తి ఇటీవలి ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మాడ్ ప్రాంతంలో జరిగిన కౌంటర్-నక్సల్ ఆపరేషన్లు వల్ల ‘ఆశన్న’ సరెండర్ నిర్ణయానికి దారితీసిందని పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారు.

## మల్లోజుల సరెండర్

**మొదటి పేజీ తరువాయి**

మంది ఉద్యమ సహచరులతో కలిసి బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట అధికారికంగా లొంగిపోయారు. సీఎం సమక్షంలో వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందం (60 మంది మావోయిస్టులు) సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. లొంగిపోయిన నక్సల్స్ 54 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఏడు ఏకే -47, తొమ్మిది ఇన్సాస్ రైఫిల్స్ ఉన్నాయి. భూపతి అలియాస్ సోనూ మావోయిస్టు సంస్థలో అత్యంత ప్రభావవంతమైన వ్యూహకర్తలలో ఒకరు. మహారాష్ట్ర-ఛత్తీస్గఢ్ సరిహద్దులో ప్లాటూన్ కార్యకలాపాలను సుదీర్ఘంగా పర్యవేక్షించాడు. మల్లోజులపై రూ.6 కోట్ల రివార్డు ఉన్నట్లు గడ్చిరోలి పోలీసులు ప్రకటించారు. పార్టీలో అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు. తీవ్ర ఒడిదొడుకులతో సాయుధ ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ఇది ఇబ్బందికర పరిణామమే. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజుల సొంత రాష్ట్రం తెలంగాణ. పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు వేణుగోపాల్‌రావు మూడో సంతానం. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తండ్రి నుంచే వేణుగోపాల్, ఆయన రెండో అన్న కోటేశ్వరరావు స్ఫూర్తి పొందారు. చదువు పూర్తయిన అనంతరం తన అన్న పిలుపు మేరకు ఉద్యమంలో ప్రవేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాద నిర్మూలన ప్రయత్నాల్లో భాగంగా భద్రతా బలగాలకు భారీ విజయం లభించింది. సుక్మా జిల్లాలో బుధవారం ఏకంగా 27 మంది క్రియాశీలక మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.



## తిండెక్కువైంది!

న్యూఢిల్లీ: మన పర్యావరణ వ్యవస్థ చాలా సున్నితమైనది. ఆహార ఉత్పత్తి, వినియోగం.. పర్యావరణంతో లోతుగా ముడిపడి ఉన్నాయి. అనియంత్రిత జనాభా పెరుగుదల, అస్థిరమైన ఉత్పత్తి, వినియోగ పద్ధతులు పర్యావరణ నాశనానికి, వాతావరణ మార్పులను తీవ్రతరం చేశాయి. ఇది ఆహార వ్యవస్థను కూడా దెబ్బతీసింది, జీవవైవిధ్య లోపం, వాతావరణ మార్పు, కాలుష్యం వల్ల ఇది ప్రభావితం అవుతోంది. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) డేటా ప్రకారం, సుమారు 673 మిలియన్ మంది ఆకలితో జీవిస్తున్నారు. కానీ, అదే సమయంలో ప్రతి సంవత్సరం 1 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆహారం వ్యర్థం అవుతోంది. ఆహారాన్ని వృథాగా పడేసే దేశాల్లో భారత్ రెండోస్థానంలో ఉండటం శోచనీయం. ఆహారాన్ని పడేస్తున్న దేశాల్లో చైనా తొలి స్థానంలో ఉండగా, పాకిస్థాన్, నైజీరియా, అమెరికా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, మెక్సికో దేశాలు టాప్ 10లో ఉన్నాయి. భారత్‌లో ఏటా 7.8 కోట్ల టన్నుల ఆహారం చెత్త పాలు అవుతోందని తాజా అధ్యయనం తేల్చింది. చైనాలో ఒక్కో వ్యక్తి ఏటా 76 కిలోల ఫుడ్‌ను పడేస్తున్నాడట.



## కేటీఆర్ డ్రగ్స్ సప్లయర్

### నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సంచలన ఆరోపణలు

నిజామాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ అనటం హాస్యాస్పదమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. అసలు రాష్ట్రంలో దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. జూబ్లీహిల్స్ అపార్టుమెంటులో 43 ఓట్లు దొంగ ఓట్లు ఉంటే, బోధన్‌లో బీఆర్ఎస్ హయాంలో 42 దొంగ పాస్‌పోర్టులు ఇచ్చిన సంగతి మరిచారా? అంటూ ఫైర్ అయ్యారు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్థులకు గతంలో ఆశ్రయం ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ క్లబ్బుల్లో డ్రగ్స్, మత్తు పదార్థాలు సప్లై చేసింది కేటీఆర్ కాదా? అని ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో ఆర్వోబీల నిధులు వెంటనే విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేపడతానని, దీపావళి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇస్తున్నా అని వార్నింగ్ ఇచ్చారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వాస్తవాలు తెలుసుకోకుండా కేంద్రంపై తప్పుడు స్టేట్‌మెంట్స్ ఇవ్వొద్దని పేర్కొన్నారు.

# ప్రియుడితో భర్తను చంపించిన భార్య

**నాగర్ కర్నూలు జిల్లాలో దారుణం**

నాగర్ కర్నూలు, అక్టోబర్ 15 (ఈవార్తలు): నాగర్ కర్నూలు జిల్లాలో వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసులు మీడియాకు వెల్లడించారు. శ్రీపురం గ్రామంలో జరిగిన ఈ హత్య కేసు వివరాల్లోకి వెళితే.. శ్రీపురం గ్రామానికి చెందిన 35 ఏళ్ల రాములు ప్లంబర్‌గా పనిచేస్తూ భార్య మానస, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం వీరి ఇంట్లో బంగారం చోరీకి గురికావడంతో, పెద్ద ముద్దునూరు గ్రామానికి చెందిన మంత్రగాడు సురేశ్ గౌడ్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో సురేశ్‌తో మానసకు పరిచయం ఏర్పడి, అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. సురేశ్‌తో తన సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించిన మానస, భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఈ నెల 8న బంధువుల పెళ్లి ఉందని చెప్పి వెళ్ళింది. ఆ సమయంలోనే భర్తను హత్య చేయాలని పథకం వేసింది. సురేశ్ డెయిరీ ఫామ్ కూడా నిర్వహిస్తున్నాడు. మానస భర్తను హత్య చేసేందుకు తన వద్ద పనిచేసే ఇద్దరితో సురేశ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముగ్గురు కలిసి రాములును పెద్ద ముద్దునూరుకు రప్పించారు. పథకం ప్రకారం అతనికి ఎక్కువ మద్యం తాగించి స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం నోరు, ముక్కుకి ప్లాస్టర్ వేసి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. రాములు ఒంటిపై గాయాలు చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేసి వెళ్ళారు. మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తన కొడుకు మృతిపై అనుమానం వచ్చిన రాములు తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోడలు వివాహేతర సంబంధం, ఇంట్లో జరుగుతున్న గొడవల గురించి పోలీసులకు తెలియజేశాడు. దీంతో పోలీసులు సురేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.



# అబార్షన్ కోసం వెళితే ప్రాణం పోయింది!

**హోంగార్డుతో ప్రేమ.. గర్భవతి అయిన యువతి**

**అబార్షన్ చేయించేందుకు ఆర్ఎంపీ వైద్యురాలి వద్దకు**

**వైద్యం వికటించి విషమించిన పరిస్థితి**

**ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి**

శంషాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): శంషాబాద్ మండలంలో అక్రమ గర్భస్రావం ఓ యువతి ప్రాణాలను బలిగొంది. ఓ హోంగార్డు తన ప్రియురాలికి గర్భస్రావం చేయించేందుకు ప్రయత్నించగా, వైద్యం వికటించి ఆమె మృతిచెందిన విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే... శంషాబాద్ పోలీస్ క్లూస్ టీంలో హోంగార్డుగా పనిచేస్తున్న మధుసూదన్, షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చింది. విషయం బయటకు రాకుండా గర్భస్రావం చేయించాలని మధుసూదన్ నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం పాలమాకుల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యురాలు పద్మజను సంప్రదించాడు. ఆమె అబార్షన్ చేసేందుకు అంగీకరించింది. అయితే, పద్మజ గర్భస్రావం చేస్తున్న సమయంలో వైద్యం వికటించడంతో యువతి పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆందోళనకు గురైన వారు, మెరుగైన చికిత్స కోసం ఆమెను నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. కానీ, మార్గమధ్యంలోనే యువతి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఆర్ఎంపీ పద్మజ పరారీలో ఉందని, ఆమెపై గతంలో కూడా పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. తమ కుమార్తె మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, మృతురాలి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు హోంగార్డు మధుసూదన్‌ను విచారిస్తూ, పరారీలో ఉన్న పద్మజ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.





## 18న బీసీ బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఈ నెల 18వ తేదీన బీసీ సంఘాలు జరపనున్న బంద్‌కు మద్దతు కోరుతూ ఆ సంఘాల నేతలు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం మాదిరే సమస్యను ఢిల్లీ దాకా తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు. పార్లమెంటులో బిల్లు పెడితే ఓటు వేసేది తమ ఎంపీలేనన్నారు. 'ఇండియా, ఎన్డీఏ రెండు కూటములు బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే చాయ్ తాగినంతసేపట్లో రిజర్వేషన్లు వస్తాయి. ఇండియా, ఎన్డీఏ రెండు కూటములు కలిస్తే బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే చట్టంగా మారుతుంది. పార్లమెంటులో బిల్లు పెడితే కచ్చితంగా అనుకూలంగా పాస్ అవుతుంది. బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ దగ్గరికి తీసుకెళ్తే మేము వచ్చి మద్దతు ప్రకటిస్తాం. ప్రధాని స్వయంగా ఓబీసీ కాబట్టి, ఆయనకి బీసీ రిజర్వేషన్లపైన చిత్తశుద్ధి ఉంటే మంచిది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## నేడు సుప్రీంకోర్టులో 'బీసీ' విచారణ

న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్లపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో రేపు విచారణ జరగనుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది. బీసీ రిజర్వేషన్లు యాభై శాతం దాటాయని చెబుతూ హైకోర్టు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 9ని కొట్టివేసింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అభిషేక్ సింఘ్వి ఈ కేసును వాదించనున్నారు. ఈ కేసు రేపు విచారణకు వస్తుండటంతో వచ్చే తీర్పు పైనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

**నిలదీసిన మాజీమంత్రి హరీశ్ రావు**

## రాహుల్ జూబ్లీహిల్స్

# ఓట్ల చోరీ సంగతేంది?

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ, తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఓట్ల చోరీపై ఎందుకు మాట్లాడట లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, మాగంటి సునీతను గెలిపించాలని, ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఃఖంలో ఉన్నారని, ఆడబిడ్డలను అవమానించే విధంగా మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని అన్నారు. విజ్ఞత మరిచి విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ ఏం చేశాయో చెప్పాలని హరీశ్ రావు నిలదీశారు. రాహుల్ గాంధీ వచ్చి మొహబ్బత్ కీ దుకాణ్ అంటారని, కానీ హైడ్రా ఏమో హైదరాబాద్ నగరంలో పేదల ఇళ్లను కూల్చివేస్తుందని, ఇదేనా ఆయన చెప్పే మొహబ్బత్ కీ దుకాణ్ అని విమర్శించారు. పండుగ రోజు కూడా పేద ప్రజల ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు. సునీతను ఓడించాలని 20 వేల దొంగ ఓట్లు కూడగట్టుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, అప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు ఇప్పుడు ఏమయ్యాయని నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రావడం కూడా కష్టమేనని హరీశ్ రావు అన్నారు. తెలంగాణలో నీటి దోపిడీ చేసే బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు.



# రూ.139 కోట్ల స్థలం సేఫ్



**రాజేంద్రనగర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్**

**జనచైతన్య లేఔట్‌లో 4 పార్కుల స్థలాలకు విముక్తి**

**మొత్తం 19,878 గజాల స్థలం కబ్జా నుంచి విడిపింపు**

రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (ఈవార్తలు): హైదరాబాద్ శివారులో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారికి హైడ్రా గట్టి షాక్ ఇచ్చింది. రాజేంద్రనగర్ పరిధిలో ఏకంగా రూ.139 కోట్లకు పైగా విలువ చేసే పార్కుల స్థలాలను ఆక్రమణల నుంచి విడిపించింది. ఈ ఉదయం భారీ ఆపరేషన్ చేపట్టి, అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. వివరాల్లోకి వెళితే, రాజేంద్రనగర్ పరిధిలోని బద్వేల్-ఉప్పరపల్లి గ్రామాలలో సుమారు 120 ఎకరాల్లో జనచైతన్య లేఅవుట్ ఫేజ్ 1, 2లను హుడా ఆమోదంతో ఏర్పాటు చేశారు. అయితే, ఈ లేఅవుట్‌లో ప్రజల అవసరాల కోసం కేటాయించిన నాలుగు పార్కుల స్థలాలు కొంతకాలంగా కబ్జాకు గురవుతున్నాయి. దాదాపు 19,878 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కులను ఆక్రమించుకుని ప్రహరీలు, షెడ్లు, గదులు నిర్మించారు. ఈ విషయంపై స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. దీంతో రంగంలోకి దిగిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పార్కుల స్థలాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించుకున్న తర్వాత హైడ్రా సిబ్బంది కూల్చివేతల ప్రక్రియ చేపట్టారు. ఆక్రమణదారులు నిర్మించిన ప్రహరీ గోడలు, షెడ్లను పూర్తిగా తొలగించారు. అనంతరం, స్వాధీనం చేసుకున్న స్థలం చుట్టూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు.

## కొడుకు పట్టించుకోవడం లేదని.. రూ.3 కోట్ల పొలాన్ని ప్రభుత్వానికి రాసిచ్చిన తండ్రి

హనుమకొండ, అక్టోబర్ 15 (ఈవార్తలు): కొడుకు పట్టించుకోవడం లేదని మనస్తాపం చెందిన ఓ తండ్రి తనకు చెందిన రూ. 3 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో చోటు చేసుకుంది. ఎల్కతుర్తికి చెందిన మాజీ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, వసంత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహం తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు. కుమారుడు కూడా అమెరికాలో ఉద్యోగం చేసి 2016లో తిరిగి వచ్చారు. కుమారుడు రంజిత్ హన్మకొండలో భార్య, పిల్లలతో కలిసి సొంతింట్లో నివసిస్తున్నారు. తన భార్య వసంత నాలుగేళ్ల క్రితం మృతి చెందారని, అప్పటి నుంచి కుమారుడు తనను పట్టించుకోవడం లేదని శ్యాంసుందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తన ఆస్తి మొత్తాన్ని తనకు తెలియకుండానే కుమారుడు పట్టా చేయించుకున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే తనను పట్టించుకోని కుమారుడికి ఆస్తి దక్కకుండా తన పేరున ఉన్న మూడెకరాల పొలాన్ని ప్రభుత్వానికి అప్పగించినట్లు శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులను చూసుకోలేని వ్యక్తికి ఆస్తి అనుభవించే హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని, అందుకు అనుగుణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన స్పష్టం చేశారు. ఆ భూమిలో తన భార్య జ్ఞాపకార్థం భవనాలు నిర్మించి ప్రజలకు అంకితం చేయాలని ఆయన కోరారు.

## 'జూబ్లీహిల్స్' ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

**నవంబర్ 6 నుంచి 11వ తేదీ సాయంత్రం వరకు ఆంక్షలు**

**టీవీ, పేపర్లు, సోషల్ మీడియాలో సర్వేల ప్రచురణపై నిషేధం**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్‌పై కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. నవంబర్ 6వ తేదీ ఉదయం 7 గంటల నుంచి నవంబర్ 11వ తేదీ సాయంత్రం 6:30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ప్రచురించడం లేదా ప్రసారం చేయడం పూర్తిగా నిషేధించినట్లు ఆర్.వి. కర్ణన్ తెలిపారు. న్యూస్ ఛానెళ్లు, వార్తాపత్రికలు, రేడియోలతో పాటు సోషల్ మీడియా, డిజిటల్ వేదికలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే సర్వేలు, విశ్లేషణలు, అభిప్రాయ సేకరణ ఫలితాలను ఈ సమయంలో వెల్లడించకూడదని ఆదేశించారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే, వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126ఏ కింద కఠిన చర్యలు ఉంటాయని కర్ణన్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. ఇదే చట్టంలోని సెక్షన్ 126(1)(బీ) ప్రకారం, పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి కూడా ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సర్వే ఫలితాలను ప్రచురించరాదని ఆయన గుర్తుచేశారు.



## 260 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఈవార్తలు): 260 కిలోల ఎండు గంజాయిని మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు కొండాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుమన్, మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుంచి బీదర్ రాష్ట్రానికి తరలిస్తుండగా.. మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులోని ముంబై జాతీయ రహదారిపై గల డక్కన్ టోల్ ప్లాజా వద్ద పట్టుకొని గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. హైదరాబాద్ నుంచి కర్ణాటకవైపు వెళ్లే వాహనాలను కంకోల్ టోల్ గెట్ వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి బీదర్ వైపు వెళుతున్న వారు గంజాయి తరలిస్తున్న వాహనాలను వదిలి పారిపోతున్న క్రమంలో మునిపల్లి పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. ఒడిశా నుంచి బీదర్‌కు 260 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.80 లక్షలు వరకు ఉంటుందని సమాచారం. గంజాయి తరలిస్తూ పారిపోతున్న వారిని వెంబడించి పట్టుకోవడంతో వారిని ఉన్నతాధికారులు అభినందించారు.

# తమిళనాడులో 'హిందీ' బంద్

**హిందీ పాటలు, సినిమాలపై బ్యాన్**

**అసెంబ్లీలో బిల్లుకు నిర్ణయం**

చెన్నై: త్రిభాషా సూత్రంపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ విభేదాల నేపథ్యంలో విద్యా విధానాన్ని మార్చిన సీఎం స్టాలిన్ తాజాగా రాష్ట్రంలో హిందీ భాషకు వ్యతిరేకంగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో హిందీ భాషను నిషేధించే లక్ష్యంతో అసెంబ్లీలో ఓ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదిత చట్టంపై చర్చించేందుకు నిన్న రాత్రి న్యాయ నిపుణులు, ప్రభుత్వం మధ్య అత్యవసర సమావేశం జరిగినట్లు సమాచారం. రాష్ట్రం అంతటా హిందీ హోర్డింగ్‌లు, బోర్డులు, హిందీ సినిమాలు, హిందీ పాటలను నిషేధించే లక్ష్యంతో ఈ బిల్లును రూపొందించినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రాజ్యాంగానికి లోబడే దీన్ని రూపొందించినట్లు సమాచారం. తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని డీఎంకే సహా పలు పార్టీలు ఆరోపిస్తోన్న విషయం తెలిసిందే. తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దడానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్ర శాసనసభ ఇటీవలే ఓ తీర్మానం చేసింది. అధికార భాషలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ నివేదికలోని సిఫారసులను అమలు చేయవద్దని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సెప్టెంబర్ 9న రాష్ట్రపతికి ఈ కమిటీ నివేదించిన సిఫారసులు తమిళంసహా ఇతర రాష్ట్రాల భాషలకు, వాటిని మాట్లాడే ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ సీఎం ఎంకే స్టాలిన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంతోపాటు హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలకు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇచ్చిన హామీకి పార్లమెంటరీ కమిటీ సిఫారసులు వ్యతిరేకంగా ఉన్నాయని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. దీన్ని అసెంబ్లీ ఆమోదించింది.



## సోషల్ వాణి



1970-80 లలో మనకన్నా తక్కువ అభివృద్ధి ఉన్న, మన పక్కనున్న దేశాలు ప్రగతి వైపు ఫోకస్‌గా అడుగులేస్తూ ఇప్పుడు శక్తివంతమైన దేశాలుగా నిలబడితే, మనదగ్గర ఉన్న గొప్ప మానవ వనరులు మాత్రం అడవుల పాలైంది. సంపద రక్షణ, సంఘ రక్షణ ఘర్షణలో ఎన్కౌంటర్లలో ఎంతో మేధోసంపత్తి ఆవిరైపోయింది. మేధో యుద్ధంతో గెలవాల్సిన క్షేత్రంలో ఇలాంటి రోజు ఎప్పుడో 30-35 ఏండ్ల కిందనే రావాల్సి ఉండే. ఇప్పటికైనా సంతోషం. ముందు నిలబడి కాపాడాల్సిన అవసరం లేదు. తమను తాము కాపాడుకునే చైతన్యం కల్పించండి.

- పాశం రఘునందన్ రెడ్డి

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు



**అందజేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు చెందిన 15 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 2,65,500/- చెక్కులను ఎమ్మెల్సీ రమణ అందజేశారు. బుధవారం జగిత్యాల ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు గట్టు సతీశ్, తేలు రాజు, అల్లాల ఆనంద్ రావు, బార్కం మల్లేశం, పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్ రావు, సాగి సత్యం రావు, లౌడ్యా సురేందర్ నాయక్, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, దయ్యాల మల్లారెడ్డి, కోరుకంటి రాము, వనమాల నిరంజన్, కుడిక్యాల సర్వేశ్వర్, ఆరవెల్లి లక్ష్మణ్, పులి మల్లేశం గౌడ్, గంగిపెల్లి వేణుమాధవ్, పడిగేల గంగారెడ్డి, రాగుల రాజు, అత్తినేని నరేశ్, చిగుళ్ల భగవాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కనీస మద్దతు ధరల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, తదితరులు

# నీళ్లుంటేనే డేటా సెంటర్!

**సర్వర్లను చల్లార్చేందుకు భారీగా వినియోగం**

**గత ఏడాది గూగుల్ 30.7 బిలియన్ లీటర్ల నీటి వినియోగం**



**(ఈవార్తలు ప్రత్యేకం)**

డేటా కేంద్రాలు డిజిటల్ ప్రపంచానికి వెన్నెముకగా పనిచేస్తూ, కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సేవలకు మద్దతు ఇస్తాయి. అయితే ఈ కేంద్రాలు భారీ మొత్తంలో విద్యుత్‌తో పాటు నీటిని కూడా వినియోగించు కుంటాయి. ముఖ్యంగా చల్లదనం ప్రక్రియలో నీటి వినియోగం జరుగుతుంది. ఈ నీటి వినియోగం పర్యావరణానికి, ప్రధానంగా నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఆందోళన కలిగిస్తోం ది. డేటా కేంద్రాలలో సర్వర్లు, ప్రాసెసర్లు భారీ వేడిని ఉత్పత్తి చేస్తాయి. ఈ వేడిని తగ్గించడానికి నీటి వినియోగం తప్పనిసరి. వాటర్ ఫుట్‌ప్రింట్ (నీటి పరిమాణం) లో రెండు రకాల నీటి వినియోగం ఉంటుంది. డేటా కేంద్రాలలో సర్వర్లను చల్లబరచడానికి (కూలింగ్) నీటిని నేరుగా ఉపయోగించాల్సి ఉ ంటుంది. ఉదాహరణకు చల్లదనం టవర్లు లేదా ద్రవ చల్లదనం వ్యవస్థలలో నీరు ఆవిరిగా మారి తొలగిపోతుంది. డేటా కేంద్రాలకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి విద్యుత్ శాలలలో ఉపయోగించే నీరు. ఇది సాధారణంగా ప్రత్యక్ష వినియోగం కంటే చాలా ఎక్కువ ఉంటుంది. మొత్తం వాటర్ ఫుట్‌ప్రింట్‌లో 60 శాతం వరకు ఉండవచ్చు. ఉదాహరణకు గూగుల్ డేటా కేంద్రాలు 2024లో 8.1 బిలియన్ గ్యాలన్ల (సుమారు 30.7బిలియన్‌లీటర్లు) నీటిని వినియోగించా యి. ఇందులో ప్రత్యక్ష, పరోక్ష వినియోగం 2 ఉన్నాయి. ఈ మొత్తం వాటర్ ఫుట్‌ప్రింట్ డేటా కేంద్రాలు పర్యావరణంపై చూపే ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నీటి కొరత ఉన్న ప్రాంతాలలో ఈ పరిస్థితి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డేటా కేంద్రాలు భారీ నీటి వనరులను తీసుకుని ఆవిరి చేస్తున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు పెరుగుదలతో ఈ పరిస్థితి వచ్చింది.

# లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధం

**చంద్రబాబుకు జోగి రమేశ్ సవాల్**

విజయవాడ, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఏపీ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్ధన్ రావుతో తనకు సంబంధాలున్నాయం టూ వస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రంగా స్పందించారు. ఆ ఆరోపణలను నిరూపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆయన సవాల్ విసిరారు. నిందితుడితో తాను వాట్సాప్‌లో చాటింగ్ చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన్ రావు విచారణలో భాగంగా, జోగి రమేశ్‌తో వాట్సాప్‌లో చాట్ చేసినట్లు చెప్పాడని వార్తలు రావడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో బుధవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన జోగి రమేశ్, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

# మల్లన్న దర్శనానికి మోదీ

**కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటన.. భారీగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

**ఏర్పాట్లు చేసిన ఏపీ కూటమి సర్కారు**

**తెలుగులో ట్వీట్ చేసిన ప్రధాని**



కర్నూలు, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఏపీలోని కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రధాని పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టనున్నారు. మొత్తంగా రూ. 13,429 కోట్ల మేర అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టనున్నారు. వీటిల్లో కొన్ని శంకుస్థాపనలు, కొన్ని ప్రారంభోత్సవాలు ఉండగా.. ఓ రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు ప్రధాని. రూ. 9449 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తుండగా... రూ. 1704 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు. ఇక రూ. 2276 కోట్ల విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు.

**ప్రధాని పర్యటన ఇలా..**


ఢిల్లీ నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు ప్రధాని చేరుకుని అక్కడి నుంచి శ్రీశైల దేవస్థానానికి చేరుకుంటారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ప్రధానమంత్రి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో కర్నూలు సభకు చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని హెలీకాప్టర్ ద్వారా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నారు. అలాగే సభకు వచ్చే ముందు శ్రీశైలం దివ్యక్షేత్రానికి వెళ్లి జ్యోతిర్లింగ మూర్తి శివుణ్ణి, శక్తిపీఠంలో కొలువైన భ్రమరాంబిక దేవిని ప్రధాని మోదీ దర్శించుకుంటారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. 2024 ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కూటమి నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడిన తర్వాత ఏపీలో ప్రధాని విశాఖ, అమరావతి ప్రాంతాల్లో పర్యటించారు. గురువారం రాయలసీమ ప్రాంతంలో ప్రధాని పర్యటన జరగనుంది. కర్నూలులో ప్రధాని హాజరు కానున్న భారీ బహిరంగ సభను అంతే సక్సెస్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. వివిధ శాఖల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది రాష్ట్ర ప్రభుత్వం. గత 15 రోజుల నుంచి వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు నిరంతరం కర్నూలు సభను మానిటర్ చేస్తున్నారు. సభకు వచ్చే వారికి భోజన సౌకర్యం మొదలుకుని... పార్కింగ్, సభలో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, తిరిగి వెళ్లేటప్పుడు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా... అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి భారీ ఎత్తున ప్రజలు ఈ సభకు వస్తారని అంచనా. లక్షలాది సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగ్గ ఏర్పాట్లు, బందోబస్తు చేపట్టారు. సభకు వచ్చే వారికి ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే భారీ బందోబస్తు చేశారు. సుమారు 1800 మంది బలగాలతో ప్రధాని సభకు బందోబస్తు పెడుతున్నారు. ఇక ట్రాఫిక్ జాంలు కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు పెట్టారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకుంటా: ప్రధాని మోదీ

శ్రీశైలం పర్యటన నేపథ్యంలో ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలుగులో పోస్ట్ చేశారు. అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లో ఉంటానని తెలిపారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తానని తెలిపారు. 'అక్టోబర్ 16న నేను ఆంధ్రప్రదేశ్‌లో ఉంటాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో ప్రార్థనలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో 13,400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతోపాటు మరిన్ని రంగాలను సంబంధించినవి' అని పేర్కొన్నారు.

# 'సురక్ష' స్కాన్ చేశాకే మద్యం అమ్మకాలు

ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు



అమరావతి, అక్టోబర్ 15 (ఈవార్తలు): ఏపీలో ఎక్సైజ్ శాఖ రూపొందించిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా బార్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వినియోగదారులు మద్యం బాటిళ్లపై బార్ కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాతే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. బుధవారం ఆర్టీజీఎస్‌లో నిర్వహించిన సమీక్షలో ఎక్సైజ్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గతంలో మద్యం దుకాణాలను డిజిటలైజ్ చేయలేదని అందుకే క్రిమినల్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. నకిలీ మద్యాన్ని తయారు చేసి విక్రయించేందుకు ప్రయత్నించారని అన్నారు. యాచకుడు చనిపోయినా దానిని మద్యం కేసుగా మలిచే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. మద్యం కుంభకోణంలో ఉన్న వ్యక్తులు దీనిని రాజకీయం చేసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడానికి కూడా సిద్ధపడ్డారని అన్నారు. గతంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ఏరులై పారించారన్నారు. రాష్ట్రంలో బెల్టు దుకాణాల ద్వారా విక్రయాలు చేసేందుకు ప్రయత్నిస్తే పీడీ యాక్టు ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే దీని కోసం చట్టాన్ని కూడా సవరించడానికి సిద్ధం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బెల్టు దుకాణాల నిర్వహణలో ఏ పార్టీ వారున్నా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా బార్ కోడ్ స్కాన్ చేశాకే మద్యం కొనుగోలు చేసేలా అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. స్కాన్ చేసిన వెంటనే వివరాలు తెలిసేలా డిజిటల్ బోర్డును కూడా మద్యం దుకాణంలో వద్ద ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బాటిల్ ధర, నాణ్యత, తయారీ వివరాలు తెలిసేలా ఈ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యానికి తావులేకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల్లో ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌తో స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నెల 13 తేదీ నుంచి సురక్షాయాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఇప్పటి వరకూ 27 వేల మందికి పైగా డౌన్ లోడ్ చేసుకున్నారని ఎక్సైజ్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యాప్ ద్వారా 53,430 మంది మద్యం బాటిల్లను స్కాన్ చేశాకే మద్యం కొనుగోలు చేశారని తెలిపారు. ఇందులో 50,394 బాటిళ్లకు సంబంధించిన వివరాలు అక్కడికక్కడే కొనుగోలుదారులకు తెలిశాయని వివరించారు. 1348 మంది సరైన సమాచారాన్ని ఎంటర్ చేయకపోవటంతో ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని 1248 మంది స్కాన్ చేసినట్టు అధికారులు వివరించారు. లొకేషన్ ఆధారంగా వీటిని గుర్తించామని ముఖ్యమంత్రికి తెలిపారు. యాప్ స్కాన్ ద్వారా చేస్తున్న విక్రయాల్లో ఒక్క నకిలీ మద్యం బాటిల్ కూడా వెలుగు చూడలేదని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత పకడ్బందీగా వ్యవస్థను తయారు చేయాలని ఆదేశించారు. త్వరలోనే బీర్ బాటిళ్లకు కూడా బార్ కోడ్ ను పెట్టాలని సూచించారు. ఈ అంశంలో ప్రజల్లో విశ్వాసం పెంచేలా చూడాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# తెలంగాణకు కొత్తగా నలుగురు ఐపీఎస్‌లు

హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ కేడర్‌కు నలుగురు ఐపీఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన అయాషా ఫాతిమా, మహారాష్ట్రకు చెందిన మందారే సోహం సునీల్, రాజస్థాన్‌కు చెందిన మనీషా నెహ్రా, జార్ఖండ్‌కు చెందిన రాహుల్ కాంత్‌లను కేటాయించగా.. తెలంగాణ హోం స్టేట్‌కు చెందిన అభిజిత్ పాండేను మణిపూర్ కేడర్‌కు, ఎస్ దీప్తి చౌహాన్‌ను యూపీ కేడర్‌కు కేటాయించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మహిళా ఐపీఎస్‌ల సంఖ్య పెరిగింది. 174 మంది ట్రైనీల్లో 62 మంది మహిళలు ఉండగా.. 35.63 శాతంగా నమోదైంది. ఈ ఏడాది పరేడ్ కమాండర్‌గా తమిళనాడు కేడర్‌కు చెందిన అంజిత్ ఏ నాయర్ నాయకత్వం వహించనున్నారు. మొత్తం 174లో పురుషులు 112, మహిళా ఐపీఎస్‌లు 62 మంది ఉన్నారు. ఇందులో పెళ్లయిన మహిళల్లో 13 మంది కాగా.. పెళ్లి కాని వారు 49 మంది ఉన్నారు. పురుషుల్లో 28 మంది పెళ్లయినవారు కాగా.. 84 మంది పెళ్లి కానివారున్నారు. ఈసారి ఐపీఎస్ సాధించిన వారిలో 25 ఏళ్లలోపు పురుషులు 14 మంది ఉ ండగా.. మహిళలు ఏడుగురు ఉన్నారు. అలాగే 25 నుంచి 28 ఏళ్ల లోపు వారు మొత్తం 87 మంది ఉండగా.. ఇందులో మహిళలు 37, పురుషులు 50 మంది ఉన్నారు. 28 ఏళ్లు పైబడిన వారు మొత్తం 66 మంది కాగా.. 18 మంది మహిళలు, 48 మంది పురుషులు. 88 మంది వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉండగా.. మహిళలు 24 మంది, పురుషులు 64 మంది ఉన్నారు. గతంలో ఎలాంటి వర్క్ ఎక్స్‌పీరియన్స్ లేనివారు 86 మంది ఉండగా.. పురుషులు 48 మంది, మహిళలు 38 మంది. ఎప్పటిలాగే ఈసారి కూడా ఇంజినీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు 87 మంది ఉన్నారు. సైన్స్ బ్యాగ్రౌండ్ నుంచి 36 మంది.. ఆర్ట్స్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి 29 మంది, ఎంబీబీఎస్ చేసిన ఎనిమిది మంది, కామర్స్ నుంచి ఎనిమిది మంది, లా చేసిన వారు ఆరుగురు ఐపీఎస్‌లు ఉన్నారు.



# వడివడిగా రాజన్న గుడి పునర్నిర్మాణం

**దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్**

వేములవాడ, అక్టోబర్ 15 (ఈవార్తలు): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణం మొదలుపెట్టామని, టెండర్ కూడా పూర్తి కావడం జరిగిందని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా భక్తుల దర్శనాలు కోడె మొక్కులు ఇతర పూజలు కల్పించే విషయమై చర్చించినట్లు తెలిపారు. మరో రెండు వారాల్లో కళ్యాణకట్ట ఇతర కట్టడాలు కూల్చివేతలు పూర్తవుతాయని, ఒకవైపు కూల్చివేతలు మరోవైపు మహా మండపం నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఆలయ తూర్పు భాగంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై స్వామివారి, అమ్మవారి, గణపతి దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయంలో స్వామి వారి ఏకాంత సేవల్లో మొక్కుబడి కోసం టికెట్లు తీసుకున్న భక్తుల గోత్రనామాలు చదివి పూజలు చేస్తారన్నారు. భీమేశ్వరాలయంలో సైతం ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని వివరించారు.

# బంద్‌ను విజయవంతం చేయాలి

**పొలాస నరేందర్**



వేములవాడ, అక్టోబర్ 15 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఈ నెల 18న చేపట్టిన బంద్‌కు అన్ని వర్గాలు మద్దతు తెలపాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు. బంద్‌ను విజయవంతం చేసి బీసీల సత్తా చూపాలని అన్నారు. అదే విధంగా ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ల సాధన సమితి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీల డిమాండ్ నెరవేర్చేలా సీఎం కృషి చేయాలని విన్నవించారు. తమిళనాడులో అప్పటి సీఎం జయలలిత ఢిల్లీలో మకాం వేసి అఖిలపక్షంతో, నాటి ప్రధాని పీవీ నరసింహారావును ఒప్పించి, మెప్పించి స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజర్వేషన్లు సాధించారని, అలాగే తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.





# ఎస్పీ మల్యాల ఠాణా ఆకస్మిక తనిఖీ

**బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచన**

మల్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిస్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ సిబ్బందికి జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం జిల్లాలోని మల్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. రికార్డులు, కేసు డైరీలు, రిజిస్టర్లను పరిశీలించారు, రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని చెక్ చేసి పోలీస్ స్టేషన్లో సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పెండింగ్ కేసులన్నీ వేగంగా పూర్తి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, ఎస్సై నరేశ్, సిబ్బందిపాల్గొన్నారు.

# కలాం స్ఫూర్తి వర్షిణి ప్రసంగంలో..!



మల్యాల, అక్టోబర్ 15 (ఈవార్తలు): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన ఓ విద్యార్థిని ఇచ్చిన ప్రసంగం ఎంతోమందిలో స్ఫూర్తిని నింపింది. వివరాల్లోకెళితే. మల్యాలకు చెందిన ఇట్టె వర్షిణి హైదరాబాద్‌లోని ఓ ఐఏఎస్ అకాడమీలో కలాంపై అద్భుతమైన ప్రసంగాన్ని ఇచ్చింది. కలాం ఒక శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా విద్యార్థులకు ప్రేరణ నింపారని, సామాజిక అడ్డంకులను అధిగమించి విజయం సాధించిన వైనాన్ని వివరించింది. భారతదేశ క్షిపణి, అణ్వాయుధ అభివృద్ధిలో ఆయన కృషి, లక్ష్యాలను వివరిస్తూ అద్భుత ప్రసంగం చేసింది. అద్భుతమైన హావభావాలతో, అద్భుతమైన ఇంగ్లిష్ ఉచ్చారణతో సాగిన ప్రసంగానికి సభికుల నుంచి హర్షధ్వానాలు వ్యక్తం అయ్యాయి.

# హ్యుందాయ్ ఎండీగా భారతీయుడు

**2026 జనవరి 1 నుంచి బాధ్యతల స్వీకరణ**




న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) తన నాయకత్వంలో కీలక మార్పును ప్రకటించింది. కంపెనీ చరిత్రలోనే తొలిసారిగా ఒక భారతీయుడికి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా పనిచేస్తున్న తరుణ్ గార్గ్‌ను ఈ ఉన్నత పదవికి నియమించినట్లు బుధవారం వెల్లడించింది. తరుణ్ గార్గ్ నియామకం 2026 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుత ఎండీ ఉన్సూ కిమ్ 2025 డిసెంబర్ 31న తన బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. ఆయన దక్షిణ కొరియాలోని హ్యుందాయ్ మాతృసంస్థలో వ్యూహాత్మక బాధ్యతలు చేపట్టనున్నారు. అప్పటి వరకు తరుణ్ గార్గ్ 'ఎండీ, సీఈఓ డెసిగ్నేట్' హోదాలో కొనసాగుతారని కంపెనీ బీఎస్ఈకి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా ఉన్సూ కిమ్ కంపెనీకి అందించిన విలువైన సేవలను డైరెక్టర్ల బోర్డు ప్రశంసించింది. ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, ఐఐఎం లక్నో నుంచి ఎంబీఏ పూర్తి చేసిన తరుణ్ గర్గ్‌కు ఆటోమొబైల్ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అపార అనుభవం ఉంది. హ్యుందాయ్‌లో చేరకముందు ఆయన మారుతి సుజుకీ ఇండియాలో మార్కెటింగ్, లాజిస్టిక్స్ వంటి పలు కీలక విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. హ్యుందాయ్‌లో చేరాక మార్కెట్ వాటాను విస్తరించడంలో, లాభదాయకతను పెంచడంలో గర్గ్ కీలక పాత్ర పోషించారు. డిజిటల్ మార్కెటింగ్, గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ, యూజ్డ్ కార్ల విభాగంలో కొత్త కార్యక్రమాలకు ఆయన నాయకత్వం వహించారు. అంతేకాకుండా, భారత్‌లో హ్యుందాయ్ అందిస్తున్న 9 మోడళ్లలో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (అడాస్) ఫీచర్‌ను ప్రవేశపెట్టడంలోనూ ఆయన కృషి ఉంది. భారతదేశంలో కంపెనీ పునాదులను బలోపేతం చేసి, స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్‌గా మారాలన్న దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఈ నియామకం చేపట్టినట్లు హ్యుందాయ్ ఓ ప్రకటనలో తెలిపింది. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య హ్యుందాయ్ దేశీయ మార్కెట్లో 2,20,233 యూనిట్లను విక్రయించింది. గతేడాదితో పోలిస్తే ఇది 11.2 శాతం తక్కువ.

# ఎన్డీఏలో బీహార్ సీట్ల చిచ్చు

**అమిత్ షాతో భేటీకి సిద్ధమైన కుష్వాహా!**




పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్‌కు నామినేషన్ల గడువు అక్టోబర్ 17తో ముగియనుండటంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన కూటములైన మహాఘట్బంధన్, ఎన్డీఏలలో సీట్ల సర్దుబాటు ప్రక్రియ తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఒకవైపు ప్రతిపక్ష కూటమిలో సీట్ల పంపకాలపై స్పష్టత వస్తుండగా, అధికార ఎన్డీఏలో మాత్రం అసంతృప్తి సెగలు రాజుకుంటున్నాయి. తేజస్వి యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ, ముఖేశ్ సహానీకి చెందిన వికాశీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) మధ్య సీట్ల పంపకాలపై ఒప్పందం కుదిరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంలో భాగంగా మహాఘట్బంధన్‌లో వీఐపీ పార్టీకి 18 అసెంబ్లీ స్థానాలు కేటాయించినట్లు సమాచారం. దీంతో ప్రతిపక్ష కూటమిలో సీట్ల పంపకాల ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్లయింది. మరోవైపు, అధికార ఎన్డీఏలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సీట్ల కేటాయింపు విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఉపేంద్ర కుష్వాహా తన అసహనాన్ని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై చర్చించేందుకు ఆయన త్వరలోనే ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కానున్నారు. ఈ భేటీ తర్వాతే ఎన్డీఏలో సీట్ల పంపకాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నామినేషన్లకు కేవలం రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో, రానున్న 48 గంటల్లో బీహార్ రాజకీయాలు మరింత రసవత్తరంగా మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# తాలిబన్ పోస్టులపై పాక్ దాడులు

**పాక్-ఆఫ్ఘన్ సరిహద్దులో మళ్లీ కాల్పులు**



ఇస్లామాబాద్/కాబూల్: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య సరిహద్దు వివాదం మళ్లీ భగ్గుమంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం సెక్టార్‌లో ఈ తెల్లవారుజామున ఇరు దేశాల సైనికుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో ఆఫ్ఘన్ సైన్యానికి చెందిన పలు ట్యాంకులు, సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు పాకిస్థాన్ మీడియా వెల్లడించింది. పాక్ భద్రతా వర్గాల సమాచారం ప్రకారం ఆఫ్ఘన్ తాలిబన్ దళాలు, తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు కలిసి తమ సైనిక పోస్టులపై ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండా కాల్పులకు తెగబడ్డారని పాకిస్థాన్ ఆరోపించింది. దీంతో పాక్ సైన్యం పూర్తిస్థాయిలో, తీవ్రంగా ప్రతిస్పందించిందని అక్కడి ప్రభుత్వ మీడియా సంస్థ పీటీవీ న్యూస్ నివేదించింది. పాక్ జరిపిన ఎదురుదాడుల్లో ఆఫ్ఘన్ సైనిక పోస్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఒక ట్యాంకు మంటల్లో కాలిపోయిందని, దీంతో తాలిబన్ సైనికులు తమ స్థావరాల నుంచి పారిపోయారని పాక్ మీడియా పేర్కొంది. మరో ఆఫ్ఘన్ పోస్టును, ట్యాంకును కూడా నాశనం చేసినట్లు తరువాత వెల్లడించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఖోస్త్ ప్రావిన్స్ డిప్యూటీ పోలీస్ ప్రతినిధి తాహిర్ అహ్రార్ ఈ ఘర్షణలను ధ్రువీకరించినప్పటికీ, పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ వారంలో ఇరు దేశాల మధ్య కాల్పులు జరగడం ఇది రెండోసారి. గత శనివారం నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఆ ఘర్షణల్లో తమ సైనికులు 23 మంది మరణించారని, ప్రతిగా 200 మందికి పైగా తాలిబన్, అనుబంధ ఉగ్రవాదులను హతమార్చామని పాకిస్థాన్ ప్రకటించింది. అయితే, తమ భూభాగంపై పాక్ దాడులకు ప్రతీకారంగా 58 మంది పాక్ సైనికులను చంపినట్లు కాబూల్ తెలిపింది. సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు జోక్యం చేసుకున్నప్పటికీ ఉద్రిక్తతలు చల్లారలేదు. దీంతో ఇరు దేశాల మధ్య అన్ని సరిహద్దు క్రాసింగ్‌లను ఇప్పటికే మూసివేశారు. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను కాబూల్ ఖండిస్తూ వస్తోంది.

## అంతరిక్షంలో స్టార్ లింక్ చెత్త

న్యూయార్క్: ఇంటర్నెట్ సేవల్లో సంచలనం సృష్టించిన స్టార్ లింక్ పై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్థ అంతరిక్షంలోకి పంపిస్తున్న ఉప గ్రహాలు భూమిపై పడిపోతున్నాయని చెబుతున్నారు. రోజుకు రెండు మూడు శాటిలైట్లు ఇలా నేల రాలుతున్నాయని, ఈ ఉపగ్రహాల వల్ల లోయర్ ఎర్త్ ఆర్బిట్ లో చెత్త పేరుకుపోతోందని అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధకుడు జోనాథన్ మెక్ డోవెల్ వివరించారు. భవిష్యత్తులో లోయర్ ఎర్త్ ఆర్బిట్ లో కొత్త ఉపగ్రహాలకు చోటే లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భూమి చుట్టూ 8 వేలకు పైగా స్టార్ లింక్ సంస్థకు చెందిన శాటిలైట్లు తిరుగుతున్నాయని అంతరిక్ష నిపుణులు తెలిపారు. తన సేవలను విస్తరించే క్రమంలో స్టార్ లింక్ మరిన్ని ఉప గ్రహాలను అంతరిక్షంలోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. దీంతో భూమి చుట్టూ లోయర్ ఎర్త్ ఆర్బిట్ లో తిరిగే స్టార్ లింక్ శాటిలైట్ల సంఖ్య 30 వేలకు చేరనుందని, వీటికి 20 వేల చైనా శాటిలైట్లు కూడా తోడవుతాయని చెప్పారు. స్టార్ లింక్ పంపించే ఉప గ్రహాల జీవిత కాలం సుమారు 5 నుంచి 7 సంవత్సరాలని గుర్తుచేశారు. కాలంచెల్లిన తర్వాత ఆ ఉపగ్రహాలు లోయర్ ఎర్త్ ఆర్బిట్ లోనే తిరుగుతుంటాయని, కొన్ని భూ వాతావరణంలోకి ప్రవేశించి కాలిపోతూ నేల రాలుతాయని చెప్పారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. వరుసగా రెండు రోజుల పాటు నష్టాలను చవిచూసిన సూచీలు ఈ రోజు పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. రెండు రోజులుగా మార్కెట్లు నష్టాల్లో ముగియడంతో మదుపరులు కనిష్ఠాల వద్ద కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీని ఫలితంగా సూచీలు లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 590 పాయింట్లు, నిఫ్టీ 170 పాయింట్లు లాభపడ్డాయి. రోజంతా సూచీలు లాభాల్లోనే కొనసాగాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ అధిక లాభాలను పొందాయి. ఏషియన్ పేయింట్స్, ఎల్ అండ్ టీ, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్ సైతం లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంకు మాత్రం నష్టాలను మూటగట్టుకున్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఆసియా మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.

## ఉక్కును మించిన 'సూపర్ వుడ్'

**10 రెట్లు అధిక బలమైన కలప**



మేరీల్యాండ్: ఉక్కు కన్నా పది రెట్లు ఎక్కువ బలాన్ని, ఆరు రెట్ల తక్కువ బరువును కలిగి ఉండే ఓ ప్రత్యేకమైన కలపను అమెరికా సంస్థ ఒకటి ఆవిష్కరించింది. 'సూపర్‌వుడ్' పేరుతో పిలుస్తున్న ఈ సరికొత్త ఆవిష్కరణను ఇప్పుడు వాణిజ్యపరంగా మార్కెట్లోకి విడుదల చేసింది. నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది నాంది పలుకుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలోని మేరీల్యాండ్‌కు చెందిన 'ఇన్వెంట్‌వుడ్' అనే కంపెనీ ఈ సూపర్‌వుడ్‌ను తయారు చేస్తోంది. మెటీరియల్ శాస్త్రవేత్త లియాంగ్‌బింగ్ హు దశాబ్ద కాలంగా చేసిన పరిశోధనల ఫలితమే ఈ ఆవిష్కరణ. సాధారణ కలపను కొన్ని ప్రత్యేక రసాయనాలతో ఉడకబెట్టి, ఆ తర్వాత అధిక పీడనంతో వేడి చేయడం ద్వారా దానిలోని సెల్యులోజ్ నిర్మాణాన్ని మార్చివేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కలపలోని ఖాళీలు తొలగిపోయి, అత్యంత దృఢంగా, దట్టంగా మారుతుంది. ఇన్వెంట్‌వుడ్ కంపెనీ ప్రకారం ఈ సూపర్‌వుడ్ సాధారణ కలప కన్నా 20 రెట్లు బలంగా ఉంటుంది. దీనిపై గీతలు పడటం లేదా దెబ్బతినడం కూడా పది రెట్లు కష్టం. చెదలు, పురుగులు పట్టే అవకాశం దాదాపుగా ఉండదు. అగ్నిప్రమాదాలను సైతం సమర్థంగా తట్టుకుంటుంది. ఈ కలప గురించి ఇన్వెంట్‌వుడ్ సీఈవో అలెక్స్ లా వివరిస్తూ "వాస్తవానికి ఇది కలపే. చూడటానికి అచ్చం చెక్కలాగే ఉంటుంది, కానీ సాధారణ కలపతో పోలిస్తే ఎన్నో రెట్లు బలంగా, దృఢంగా ఉంటుంది" అని తెలిపారు. సూపర్‌వుడ్‌తో నిర్మించిన భవనాలు ప్రస్తుతం ఉన్నవాటి కంటే నాలుగు రెట్లు తేలికగా ఉంటాయని, దీనివల్ల భూకంపాలను కూడా తట్టుకోగలవని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ సూపర్‌వుడ్‌ను భవనాల బయటి భాగాలకు, ఫ్లోరింగ్, ఫర్నిచర్ తయారీలో వాడాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఫర్నిచర్‌లో ప్రస్తుతం బలం కోసం వాడే స్క్రూలు, మేకులు, ఇతర లోహపు భాగాల స్థానంలో సూపర్‌వుడ్‌నే వినియోగించవచ్చని అలెక్స్ లా అన్నారు. ప్రస్తుతం సాధారణ కలప కంటే సూపర్‌వుడ్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉత్పత్తి పెరిగాక ఉక్కుతో పోటీపడే ధరకు తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఉక్కు తయారీతో పోలిస్తే సూపర్‌వుడ్ తయారీలో కర్బన ఉద్గారాలు 90 శాతం తక్కువగా ఉంటాయని, ఇది పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని సంస్థ చెబుతోంది. ఈ ఆవిష్కరణ నిర్మాణ రంగంలో ఉక్కు, కాంక్రీటు వాడకాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించగలదనిఆశావిస్తున్నారు.

## అమెరికాలో భారత సంతతి టెకీ అరెస్ట్


**జాతీయ భద్రతా రహస్యాల లీక్ ఆరోపణలు**

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన ప్రముఖ విదేశాంగ విధాన నిపుణుడు, రక్షణ వ్యూహకర్త యాష్లీ జె టెల్లిస్‌ను ఫెడరల్ అధికారులు అరెస్ట్ చేశారు. జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత రహస్య పత్రాలను చట్టవిరుద్ధంగా తన వద్ద ఉంచుకున్నారనే తీవ్రమైన ఆరోపణలపై ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు వర్జీనియా ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ యూఎస్ అటార్నీ కార్యాలయం వెల్లడించింది. 64 ఏళ్ల టెల్లిస్, వాషింగ్టన్‌లోని ప్రఖ్యాత 'కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' సంస్థలో సీనియర్ ఫెలోగా, టాటా చైర్ ఫర్ స్ట్రాటజిక్ అఫైర్స్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వ రహస్య మెటీరియల్ నిర్వహణపై ఫెడరల్ దర్యాప్తు జరిపిన అనంతరం, గత వారాంతంలో టెల్లిస్‌ను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. రక్షణ సంబంధిత పత్రాలను అనధికారికంగా కలిగి ఉండటాన్ని నిషేధించే 18 యూఎస్సీ 793(%వ%) చట్టాన్ని ఆయన ఉల్లంఘించారని ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. ఈ కేసులో మరో కీలక కోణం కూడా వెలుగులోకి వచ్చింది. టెల్లిస్ సురక్షిత ప్రాంతాల నుంచి రహస్య పత్రాలను తొలగించారనే ఆరోపణలతో పాటు, చైనా అధికారులతో సమావేశమయ్యారనే విషయంపై కూడా దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఈ అరెస్ట్‌పై యూఎస్ అటార్నీ లిండ్సే హల్లిగాన్ స్పందిస్తూ... "ఈ ఆరోపణలలోని ప్రవర్తన మన పౌరుల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది" అని ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో టెల్లిస్‌పై నేరం రుజువైతే, అతనికి పదేళ్ల వరకు జైలు శిక్ష, 2,50,000 డాలర్ల జరిమానాతో పాటు స్వాధీనం చేసుకున్న మెటీరియల్‌ను ప్రభుత్వం జప్తు చేసే అవకాశం ఉంది.

## గోవా మాజీ సీఎం రవి నాయక్ హఠాన్మరణం

**గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన నేత**

**రవి నాయక్ మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**



పనాజీ: గోవా రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, మాజీ సీఎం రవి నాయక్ ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా గోవా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన రవి నాయక్ మృతితో రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రవి నాయక్ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "గోవా మంత్రి రవి నాయక్ జీ మరణవార్త నన్ను కలచివేసింది. అనుభవజ్ఞుడైన పరిపాలనాదక్షుడిగా, గోవా అభివృద్ధికి పాటుపడిన అంకితభావం గల ప్రజాసేవకుడిగా ఆయన చిరకాలం గుర్తుండిపోతారు. ముఖ్యంగా అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కూడా రవి నాయక్ మృతిపై సంతాపం ప్రకటించారు. "మా సీనియర్ నేత, కేబినెట్ మంత్రి రవి నాయక్ మరణం తీవ్రంగా బాధించింది. ముఖ్యమంత్రిగా, మంత్రిగా అనేక కీలక శాఖల్లో ఆయన దశాబ్దాల పాటు అందించిన సేవలు రాష్ట్రంపై చెరగని ముద్ర వేశాయి. ఆయన నాయకత్వం, వినయం, ప్రజా సంక్షేమానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయి" అని పేర్కొన్నారు.

## అమెరికా చమురు కొంటాం.. కానీ: భారత్

న్యూఢిల్లీ: అమెరికా నుంచి చమురు కొనుగోలుకు భారత్ సిద్ధంగా ఉందని, అయితే సరైన ధర లభిస్తేనే ఈ అంశాన్ని పరిశీలిస్తామని భారత్ స్పష్టం చేసింది. ఈ మేరకు వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చల నడుమ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. అమెరికా నుంచి చమురు దిగుమతికి సంబంధించిన ఒప్పందం కుదిరితే, భారత దిగుమతులపై ఉన్న 50 శాతం సుంకాలు తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. గతంలో అమెరికా భారత్ 22-23 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం కొనుగోలు చేసేది కాదని రాజేశ్ తెలిపారు. సుమారు మరో 12 నుంచి 13 బిలియన్ డాలర్ల విలువైన చమురు కొనుగోలుకు అవకాశం ఉందని చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం రావాల్సి ఉంది. రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తున్నందుకు భారత్‌పై అమెరికా అధిక టారిఫ్ విధించిన విషయం తెలిసిందే.

## బీహార్‌లో బీజేపీ రెండో జాబితా విడుదల

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తమ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. ప్రముఖ గాయకురాలు మైథిలీ ఠాకూర్ అలీ నగర్ నియోజకవర్గం నుండి పోటీ చేయనున్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఆనంద్ మిశ్రా బక్సర్ నియోజకవర్గం నుండి బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు బీజేపీ 12 మంది అభ్యర్థుల పేర్లను, వారు పోటీ చేసే నియోజకవర్గాలను ప్రకటించింది. బీహార్‌లోని మధుబని జిల్లా, బేనిపట్టికి చెందిన మైథిలీ ఠాకూర్ ఇటీవల బీజేపీలో చేరారు. ఒకవేళ అవకాశం వస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మైథిలీ గతంలోనే తెలిపారు. ఆమెను ఎన్నికల కమిషన్ ఇదివరకే బీహార్ స్టేట్ ఐకాన్‌గా నియమించింది. రాష్ట్రానికి సాంస్కృతిక రాయబారిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీజేపీ మొత్తం 101 స్థానాలకు గాను ఇప్పటివరకు 83 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సోమవారం 71 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడుతాయి.

## 2040లో చంద్రుడిపైకి భారతీయ వ్యోమగామి

**ఇస్రో చీఫ్ నారాయణన్ వెల్లడి**



చెన్నై: వికసిత భారత్‌కు సూచికగా 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెట్టనున్నారని ఇస్రో చీఫ్ నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రస్తుతం అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. వాటిలో 80 వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనానికి వీనస్ ఆర్బిటర్ మిషన్ ఏర్పాటు వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 2027లో చేపట్టబోయే మానవసహిత గగనయాత్ర మిషన్ ప్రణాళికాబద్ధంగా సాగుతోందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయాత్ర చేపట్టాలని ప్రధాన మంత్రి నిర్దేశించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఈ అంతరిక్ష యాత్ర కీలకమని ఆయన అన్నారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్ష రంగంలో రెండు లేదా మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణపై అధ్యయనం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ వెల్లడించారు. వ్యవసాయం మొదలు వాహన పర్యవేక్షణ వరకు ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఈ ప్రయోగాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

## ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో టపాసుల వినియోగంపై సుప్రీంకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్స్‌ను పరిమితంగా కాల్చుకునేందుకు అనుమతినిస్తూ, ఈ నెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు వెసులుబాటు కల్పించింది. అయితే, ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోకి బయటి ప్రాంతాల నుంచి టపాసులను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "బయటి నుంచి అక్రమంగా తరలించే టపాసుల వల్లే పర్యావరణానికి ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. మనం పర్యావరణంతో రాజీ పడకుండా, సంయమనంతో కూడిన సమతుల్య విధానాన్ని అనుసరించాలి" అని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. తక్కువ ముడిసరుకులతో, ధూళిని తగ్గించేలా తక్కువ ఉద్గారాలను వెలువరించే వాటిని "గ్రీన్ క్రాకర్స్"గా పరిగణిస్తారు. ప్రస్తుతం తాము ఇచ్చిన ఆదేశాలు కేవలం తాత్కాలిక చర్య మాత్రమేనని కోర్టు స్పష్టం చేసింది. నిర్దేశించిన నాలుగు రోజుల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలోని వాయు నాణ్యత సూచీని నిరంతరం పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించింది. దీనిపై సమగ్ర నివేదికను తమకు సమర్పించాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## క్రెడిట్ కార్డులతోనే లక్షల్లో సంపాదన

**1,638 కార్డులతో గిన్నిస్ కెక్కిన భారతీయుడు**



న్యూఢిల్లీ: షాపింగ్ కోసమో, కొత్త ఫోన్ కొనడానికో లేక సూపర్ మార్కెట్లో సరుకులు కొనడానికో, బిల్లులు చెల్లించేందుకో క్రెడిట్ కార్డు ఉపయోగించడం సాధారణమే. క్రెడిట్ కార్డు ఉందని ఎడాపెడా ఖర్చు చేసి నెలాఖరున చెల్లించలేక తలపట్టుకునే వారు కోకొల్లలు.. అయితే, ఓ వ్యక్తి మాత్రం ఈ కార్డులతోనే లక్షల్లో సంపాదిస్తున్నాడు. అతడి దగ్గర ఒకటీ రెండు కాదు.. ఏకంగా 1,638 క్రెడిట్ కార్డులు ఉన్నాయి. అన్నీ పనిచేస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక క్రెడిట్ కార్డులు పొందిన వ్యక్తిగా ఏకంగా గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించిన ఆ వ్యక్తి మన భారతీయుడే.. పేరు మనీశ్ ధమేజా. ఇన్ని వందల కార్డులు ఉన్నాయని మనీశ్ కు ఎంత అప్పు ఉందో అనుకుంటే పొరపాటే. ఒక్క కార్డుపైనా ఒక్క రూపాయి కూడా అప్పులేదు. ఎప్పటికప్పుడు అప్పు చెల్లించేస్తాడు. ఖర్చు పెట్టేందుకు బ్యాంకులు ఇచ్చిన కార్డులతోనే లక్షల్లో సంపాదిస్తున్నాడు. క్రమం తప్పని పేమెంట్లు చేసినందుకు సదరు కార్డుల ద్వారా వచ్చే రివార్డు పాయింట్లు, క్యాష్ బ్యాక్‌లతో పాటు ట్రావెల్ ఆఫర్లు, ఫ్లిఫ్ కార్ట్, అమెజాన్ వంటి సంస్థలు ఇచ్చే ఆఫర్లను తాను వాడుకోవడంతో పాటు ఇతరులకు అమ్ముతూ సంపాదించుకుంటున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఏటీఎంలు, బ్యాంకుల ముందు జనం బారులు తీరిన సంగతి తెలిసిందే. అదిగో అప్పుడే తాను క్రెడిట్ కార్డుల వైపు మొగ్గుచూపానని మనీశ్ చెప్పారు. ఇప్పుడు క్రెడిట్ కార్డులు తన జీవితంలో భాగమైపోయాయని, అవి లేని జీవితాన్ని ఊహించలేనని చెప్పుకొచ్చాడు. సరైన ప్లానింగ్‌తో కార్డులను వాడుకుంటూ ఆర్థిక క్రమశిక్షణతో జీవితాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలిపాడు.

## యూఎన్ మానవ హక్కుల మండలికి ఏడోసారి భారత్

జెనీవా: అంతర్జాతీయ వేదికపై భారత్ మరో కీలక దౌత్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి సభ్య దేశంగా ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైంది. 2026%-%28 కాలానికి గాను ఈ పదవిలో భారత్ కొనసాగనుంది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ చారిత్రక విజయంపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పి. హర్షం వ్యక్తం చేశారు. "మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పరిరక్షణలో భారత్‌కు ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఈ ఎన్నిక ఒక ప్రతీక" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఏకగ్రీవంగా మద్దతు పలకడం ద్వారా భారత్‌పై ఉంచిన నమ్మకాన్ని ఇది తెలియజేస్తోందని అన్నారు. ఈ ఎన్నికల్లో మద్దతు తెలిపిన అన్ని సభ్య దేశాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ పదవీ కాలంలో మానవ హక్కుల పరిరక్షణ లక్ష్యాన్ని మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లడానికి భారత్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ప్రోత్సాహం, పరిరక్షణతో పాటు, వాటి ఉల్లంఘనలపై సమీక్ష జరపడంలో మానవ హక్కుల మండలి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విజయంతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ తన నాయకత్వ పటిమను మరోసారి చాటుకుంది.

వయ్యారి చిత్రం




# స్టార్ హీరోలతోనే సినిమాలు

ఎవరైనా సరే ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత గ్యాప్ తీసుకోకుండా వరుస పెట్టి సినిమాలు చేయాలనే అనుకుంటారు. హీరోల దగ్గర నుంచి డైరెక్టర్ల వరకు, నిర్మాతల నుంచి సైడ్ ఆర్టిస్ట్ వరకు అందరూ ఇదే ఆలోచనతో ఉంటారు. కానీ చాలా కొందరు మాత్రమే లేటైనా పర్లేదు చేస్తే భారీ ప్రాజెక్టే చేయాలనుకుని అది సెట్ అయ్యే వరకు వెయిట్ చేస్తూ ఉంటారు. టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కూడా ఇదే లిస్ట్ లోకి వస్తారు. ఆయన కెరీర్ ను చూసుకుంటే ఇప్పటివరకు స్టార్ హీరోలతోనే సినిమాలు చేసుకుంటూ వచ్చారు. మున్నాతో కెరీర్ ను మొదలుపెట్టిన వంశీ, ఆ సినిమా ఫ్లాపైనా సరే తర్వాత కూడా స్టార్ హీరోలతోనే సినిమాలు చేస్తున్నారు. ఇక్కడ హీరోలకు టైమ్ లేకపోవడమో, డేట్స్ అడ్జస్ట్ అవకపోవడమో జరిగితే వేరే ఇండస్ట్రీలకు వెళ్లి అక్కడి స్టార్ హీరోల దగ్గరకు వెళ్తున్నారు తప్పించి కాంప్రమైజ్ అయి చిన్న హీరోలతో మాత్రం సినిమాలు చేయడం లేదు. అందుకే వంశీ కెరీర్లో గ్యాప్ ఎక్కువగా వస్తుంది. ఎప్పుడో ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ వంశీ చాలా తక్కువ సినిమాలు చేయడానికి గల కారణాల్లో ఇది మెయిన్ రీజన్



అని చెప్పొచ్చు. సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా పెద్ద స్టార్లపై ఫోకస్ పెట్టి వారితోనే సినిమాలు చేయాలని చూస్తూ వస్తున్నారు. మహేష్ బాబు తో మహర్షి చేసిన తర్వాత మరో సినిమా కూడా చేస్తారన్నారు. కానీ ఆ ప్రాజెక్టు క్యాన్సిల్ అయింది. అయినప్పటికీ కాన్ఫిడెన్స్ ను కోల్పోకుండా కొంతకాలం పాటూ వెయిట్ చేసి తమిళ స్టార్ హీరో విజయ్ తో వారిసు (తెలుగులో వారసుడు) తీశారు. వారిసు వచ్చి చాలా కాలమైంది. కానీ ఇప్పటివరకు వంశీ నుంచి మరో సినిమా రాలేదు. ఆల్రెడీ వారిసు మూవీతో కోలీవుడ్ లోకి ఎంటరైన వంశీ, ఆ తర్వాత బాలీవుడ్ పై కన్నేసి ఆమిర్ ఖాన్ తో సినిమా చేయాలనుకున్నారు. కానీ ఆమిర్ తో సినిమా వర్కవుట్ అవలేదు. ఆమిర్ తో కుదరకపోయినా ఈసారి బాలీవుడ్ లోనే సినిమా చేయాలని పట్టుబట్టి మరీ అక్కడే తిష్ట వేసుకుని కూర్చుని, మరో స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తో సినిమా చేయాలని ఆయనకు కథ చెప్పి, ఒప్పించారని తెలుస్తోంది. వంశీ చెప్పిన కథకు సల్మాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ సినిమాను దిల్ రాజు నిర్మించనున్నారట. ప్రస్తుతం సల్మాన్ మార్కెట్ భారీ స్థాయిలో లేకపోయినా అంతటి స్టార్ హీరోతో సినిమా చేసే ఛాన్స్ వస్తే దాన్ని వదులుకోవాలని రాజు లాంటి నిర్మాత అనుకోరు. ఈ ప్రాజెక్టు గురించి మిగిలిన అప్డేట్స్ కోసం కొన్నాళ్ల పాటూ వెయిట్ చేయాల్సి ఉంటుంది. దిల్ రాజు కు ఒకప్పుడున్నంత సక్సెస్ రేట్ ఈ మధ్య ఉండటం లేదు. ఇలాంటి టైమ్ లో సల్మాన్ తో సినిమా చేసి రిస్క్ చేయడం అవసరమా అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.




## త్వరలో 'సంక్రాంతికి వస్తున్నాం' హిందీ రీమేక్!

బాలీవుడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, దిల్ రాజు సంక్రాంతికి వస్తున్నాం రీమేక్‌ను అనీస్ బాజ్మీ దర్శకత్వంలో నిర్మించబోతున్నారు. ఇప్పటికే అనీస్ బాజ్మీ హిందీ రీమేక్ కోసం స్క్రిప్ట్ ను రెడీ చేస్తున్నాడట. స్క్రిప్ట్‌లో హిందీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా మార్పులు చేస్తున్నారట. స్క్రిప్ట్ వర్క్ పూర్తి అయిన తర్వాత ఒకరు ఇద్దరు హీరోల వద్దకు వెళ్లి సంప్రదించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి హీరో విషయంలో తుది నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదు. వచ్చే ఏడాదిలో సినిమా షూటింగ్ ప్రారంభించాలి కనుక అప్పుడే నటీనటుల ఎంపిక చేయాలని దిల్ రాజు అండ్ టీం భావిస్తున్నారు. అక్షయ్ కుమార్‌తోనే సినిమాను కాస్త ఆలస్యం అయినా రీమేక్ చేయాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు. కానీ దిల్ రాజు మాత్రం అప్పటి వరకు వెయిట్ చేసే పరిస్థితి కనిపించడం లేదు అని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా హిందీలో అక్షయ్ కుమార్ కాకుంటే మరెవ్వరు చేస్తారు అనేది చూడాలి.



## మత్తెక్కించే కళ్ళతో విష్ణుప్రియ..

టాలీవుడ్ లో హాట్ యాంకర్ గా పేరు తెచ్చుకుంది విష్ణు ప్రియా. పోరా పోవే గేమ్ షోతో పాపులర్ అయినా ఈ బ్యూటీ ఆ తరువాత కూడా పలు షోలలో అలరించింది. ఆ ఫేమ్ తో బిగ్ బాస్ సీజన్ 8లో అడుగుపెట్టింది. ఇక సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టీవ్ గా ఉండే విష్ణు ప్రియా రీసెంట్ గా ఫోటోలను షేర్ చేసింది. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి లేట్ ఎందుకు మీరు కూడా చూసేయండి.

### కాటేరమ్మ కొడుకు
## మళ్లీ వస్తున్నాడు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్. రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 23న అభిమానులకు అదిరిపోయే ట్రీట్ రాబోతుంది. ప్రభాస్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. దీనికి సంబంధించి హొంబలే ఫిలిమ్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2023 డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా రీ రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. 'సలార్' మాత్రమే కాకుండా ప్రభాస్ నటించిన 'ఈశ్వర్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'పౌర్ణమి' వంటి చిత్రాలు కూడా రీ రిలీజ్ కాబోతున్నట్లు తెలుస్తుంది.




### తెలుగు గాయకురాలు
## బాలసరస్వతి కన్నుమూత

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తెలుగు చిత్రసీమ తొలి తరం నేపథ్య గాయనిగా ప్రసిద్ధి చెందిన రావు బాలసరస్వతి దేవి బుధవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె వయసు 97 సంవత్సరాలు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని మణికొండలో ఉన్న తన



స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలసరస్వతి దేవి ఆగస్టు 29, 1928లో జన్మించగా.. తన ఆరేళ్ల వయసు నుంచే పాటలు పాడటం మొదలుపెట్టింది. ఇక ఆకాశవాణి కార్యక్రమాల ద్వారా తెలుగు శ్రోతలకు ఆమె స్వరం సుపరిచితంకాగా.. 'సతీ అనసూయ' (1936) చిత్రంలో తొలిసారిగా పాట పాడి తెలుగు సినిమా తొలి నేపథ్య గాయనిగా చరిత్రలో నిలిచిపోయింది. తెలుగు, తమిళం, కన్నడ, హిందీతో సహా పలు భాషల్లో ఇప్పటివరకు 2000కు పైగా పాటలు ఆలపించి 'లలిత సంగీత సామ్రాజ్ఞి'గా పేరు పొందింది బాల సరస్వతి దేవి. కాగా.. రావు బాలసరస్వతి దేవి మరణం పట్ల సినీ ప్రముఖులు, సంగీత అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## 8 గంటలే అని గిరిగీసుకొని కూర్చోను

పని గంటల వివాదంపై కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నటి స్మృతి ఇరానీ స్పందించారు. 'పని గంటల గురించి ఈమధ్య ఇండస్ట్రీలో పెద్ద వివాదమే నడుస్తోంది. దీన్ని కొంతమంది నెగటివ్ చేసి మరింత పెద్దది చేస్తున్నారు. కానీ ఈ అంశంపై మాట్లాడి నెగిటివ్ గా మాట్లాడి వివాదంలో ఇరుక్కోవడం నాకు ఇష్టం లేదు. పెద్ద సినిమాల నుండి దీపికా పదుకొనేని తీసేసారు అంటే పూర్తిగా అది ఆమె వ్యక్తిగత విషయం. దాని గురించి నేను మాట్లాడాలనుకోవడం లేదు. అందరి సంగతేమో కానీ నేను మాత్రం నా పని పట్ల అంకితభావంతో ఉంటాను. నిర్మాతలకు ఎప్పుడు లాభాలు తెచ్చిపెట్టేలాగే చేస్తాను. నేను సీరియల్స్ చేస్తున్న టైంలోనే నాకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ టైంలో పిల్లలు ఉన్నా కూడా నిర్మాతల లాభం గురించి ఆలోచించాను. ఒకరోజు నేను షూటింగ్ కి వెళ్లకపోతే 120 మందికి పని ఉండదు. నాకోసం 120 మంది కుటుంబాలకు అన్యాయం జరగడం నాకు ఇష్టం ఉండదు. అందుకే నేనెప్పుడూ కూడా నిర్మాతల లాభాల గురించి, వారికి న్యాయం జరగడం గురించే ఆలోచించేదాన్ని. రాజకీయాల్లో రాణించడం.. నటిగా రాణించడం.. పిల్లల్ని చూసుకోవడం.. ఇవన్నీ నా ఎంపికే కాబట్టి వీటన్నింటికీ నేను సమాన న్యాయం చేసేదాన్ని. ఎప్పుడూ కూడా నిర్మాతల లాభాన్ని దృష్టిలో పెట్టుకునేదాన్ని. అందుకే వారికి నష్టాలు రాకుండా ఉండడానికి ఎంత కష్టమైనా పనిచేసేదాన్ని' అంటూ స్మృతి ఇరానీ చెప్పుకొచ్చింది. దీంతో స్మృతి ఇరానీ మాట్లాడిన మాటలు దీపికా పదుకొనే కౌంటర్ ఇచ్చినట్లుగానే ఉన్నాయి.




# అసుర ఆగమనం

**సాయి దుర్గ తేజ్ 'సంబరాల ఏటి గట్టు' గ్లింప్స్ రిలీజ్**

సుప్రీమ్ హీరో సాయిదుర్గా తేజ్ విరూపాక్ష సినిమాతో కెరీర్ బిగ్గెస్ట్ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత చేసిన బ్రో ఫ్లాప్ అవడంతో లాంగ్ గ్యాప్ తీసుకున్నాడు. ఈ సినిమా వచ్చి దాదాపు రెండేళ్లు దాటుతున్నకూడా మరో సినిమా రిలీజ్ చేయలేదు సాయి తేజ్. కథ ప్రాముఖ్యం ఉన్నసినిమాలు చేయాలన్నా ఉద్దేశంతో నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వంలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. సాయి కెరీర్ లో 18వ సినిమాగా వస్తున్నా ఈ చిత్రానికి సంబరాల ఎటి గట్టు అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హనుమాన్ నిర్మాతలు కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి దాదాపు రూ. 120 కోట్లతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుండి నేడు చిత్ర హీరో సాయి దుర్గా తేజ్ పుట్టిన రోజు కానుకగా గ్లిమ్స్ ను రిలీజ్ చేసారు మేకర్స్. పురాతన కాలం నాటి పల్లెటూరు అక్కడ ఒక సమస్య వారికీ అండగా బాలి ఇలా ఒక్కో షాట్ ను అద్భుతంగా తెరకెక్కించారు. సాయి దుర్గ తేజ్ మేకోవర్ సూపర్బ్ గా ఉంది. అసుర సంధ్యవేళ మొదలైంది.. రాక్షసుల ఆగమనం వంటి డైలాగ్స్ బాగున్నాయి. ఇక వీడియో చివర్లో నిప్పు కణికలు మధ్య చేతికి ఆయుధం ధరించి ఉన్న సాయి దుర్గా తేజ్ కనిపించే సీన్ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా ఉందని చెప్పక తప్పదు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంలో తీసుకువస్తున్నారు.



## నా కొడుక్కి కోహ్లీ అంటే పిచ్చి: కరీనా కపూర్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంటే తన కొడుకు తైమూర్‌కు పిచ్చి అని బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ తెలిపింది. ఎప్పుడూ కోహ్లీ గురించే అడుగుతాడని, అతని ఫోన్ నంబర్ ఉందా? అని ప్రశ్నిస్తుంటాడని కరీనా కపూర్ చెప్పుకొచ్చింది. సినిమా స్టార్లు, యాక్టింగ్‌పై తైమూర్ ఏ మాత్రం ఆసక్తి చూపడని, కానీ కోహ్లీ, రోహిత్, లియోనల్ మెస్సీల గురించి మాత్రం తరుచూ అడుగుతుంటాడని కరీనా కపూర్ పేర్కొంది. తాజాగా తన ఆడపడుచు సోహా అలీ ఖాన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌కు హాజరైన కరీనా కపూర్.. తైమూర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తైమూర్‌కు నటనపై ఏ మాత్రం ఆసక్తి లేదని స్పష్టం చేసింది. 'స్పోర్ట్స్ స్టార్స్ గురించే అడుగుతాడు.. యాక్టింగ్ క్లాస్‌లో జాయిన్ అవుతావా? అంటే తైమూర్ నో చెప్పేవాడు. ఒకసారి ప్రయత్నించి చూడంటే.. లేదమ్మా.. నేను యాక్టింగ్‌ను ఆస్వాదించలేనని చెప్పేవాడు. అందుకే మేం కూడా వాడిని బలవంతం చేయడం లేదు. తైమూర్.. ఎప్పుడూ నటులు, సినిమా స్టార్లు, మ్యూజిక్ గురించి ఏమీ అడగలేదు. కానీ ప్రతీసారి విరాట్ కోహ్లీ గురించి అడుగుతూ ఉంటాడు. నేను విరాట్ కోహ్లీకి మెసేజ్ చేయవచ్చా..? అతను రిప్లే ఇస్తాడా? నీ దగ్గర కోహ్లీ నెంబర్ ఉందా? అని ప్రశ్నిస్తుంటాడు. కోహ్లీతో పాటు రోహిత్ శర్మ నీకు ఫ్రెండ్సేనా? వాళ్ల బ్యాట్‌ను నాకు గిఫ్ట్‌గా ఇవ్వమని మెసేజ్ చేస్తావా? లియోనల్ మెస్సీ ఫోన్ నెంబర్ నీ దగ్గర ఉందా? అని అడుగుతుండేవాడు. వాళ్ల నెంబర్లు నా దగ్గర లేవని చెప్పేవాడిని. వానికి సినిమాలు, సినిమా యాక్టర్ల గురించి ఏ మాత్రం తెలియదు. ఎప్పుడూ స్పోర్ట్స్ స్టార్స్ గురించే అడుగుతుంటాడు' అని కరీనా కపూర్ చెప్పుకొచ్చింది.

# ఆసీస్.. కాస్కో!

### ఆస్ట్రేలియాకు టీమిండియా 19న తొలి వన్డే మ్యాచ్

వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా 24 గంటల వ్యవవధిలోనే ఆస్ట్రేలియా పర్యటనకు బయలుదేరింది. మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్లు బుధవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కింది. ముందుగా వన్డే సిరీస్ జరగనుండగా.. అక్టోబర్ 19న పెర్త్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. టీమిండియా వెటరన్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా జట్టుతో కలిసి ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కారు. కోహ్లీ, రోహిత్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. కోహ్లీ, రోహిత్‌లతో సెల్ఫీలు దిగడంతో పాటు ఆటోగ్రాఫ్స్ కోసం పోటీ పడ్డారు. ఈ వెటరన్ ఆటగాళ్లు కూడా ఓపికగా అభిమానులకు సెల్ఫీలతో పాటు ఆటోగ్రాఫ్స్ ఇచ్చారు. ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత కోహ్లీ, రోహిత్ బరిలోకి దిగుతుండటం ఇదే తొలిసారి కావడంతో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వన్డే ప్రపంచకప్ 2025 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ సిరీస్ కీలకం కానుంది. ఈ మూడు వన్డే మ్యాచ్‌ల్లో కనబర్చే ప్రదర్శనపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంది.

### భారత వన్డే జట్టు:

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(కీపర్), ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ.

### వన్డే షెడ్యూల్..

**తొలి వన్డే: అక్టోబర్ 19(ఆదివారం),పెర్త్, ఉదయం 9 గంటలకు**
**రెండో వన్డే: అక్టోబర్ 23(గురువారం), అడిలైడ్, ఉదయం 9 గంటలకు**
**మూడో వన్డే: అక్టోబర్ 25(శనివారం), సిడ్నీ , ఉదయం 9 గంటలకు**

### టీ20 జట్టు:

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేష్ శర్మ(కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్(కీపర్), రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

### టీ20 షెడ్యూల్..

**తొలి టీ20: అక్టోబర్ 29(బుధవారం),కాన్‌బెర్రా, మధ్యాహ్నం 1.45 గంటలకు**
**రెండో టీ20: అక్టోబర్ 31(శుక్రవారం), మెల్‌బోర్న్, మధ్యాహ్నం 1.45 గంటలకు**
**మూడో టీ20: నవంబర్ 2(ఆదివారం), హెూబర్ట్ , మధ్యాహ్నం 1.45 గంటలకు**
**నాలుగో టీ20: నవంబర్ 6(గురువారం), గోల్డ్ కోస్ట్ , మధ్యాహ్నం 1.45 గంటలకు**
**ఐదో టీ20: నవంబర్ 8(శనివారం), బ్రిస్బేన్, మధ్యాహ్నం 1.45 గంటలకు**



## శివమ్ దుబేకు గాయం




టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతోంది. ఆసీస్‌తో జరగబోయే కీలకమైన టీ20 సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమవుతున్న సమయంలో టీమిండియాకు ఆల్‌రౌండర్ శివమ్ దూబే గాయం రూపంలో అనూహ్య ఆందోళన ఎదురైంది. అక్టోబర్ 29 నుంచి ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు కేవలం రెండు వారాల ముందు ఈ స్టార్ ఆటగాడికి సమస్య తలెత్తడం జట్టు వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. టీమిండియా ఆస్ట్రేలియా పూర్తి స్థాయి వైట్-బాల్ పర్యటన కోసం సిద్ధమవుతోంది. అక్టోబర్ 19 నుంచి మూడు వన్డేలు, ఆ తర్వాత టీ20 సిరీస్ జరగనుంది. 2026 టీ20 ప్రపంచ కప్ సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్ అత్యంత కీలకం కాగా.. ఈ సమయంలోనే శివమ్ దూబే గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. శివమ్ దూబే వెన్ను పట్టేసిన సమస్యతో బాధపడుతున్నాడు. దీని కారణంగా ముంబై జట్టు జమ్మూ కాశ్మీర్‌తో శ్రీనగర్‌లో ఆడబోయే తమ తొలి రంజీ ట్రోఫీ 2025/26 మ్యాచ్‌కు శివమ్ దూబే అందుబాటులో ఉండడు. శివమ్ దూబే నిజానికి మ్యాచ్ కోసం శ్రీనగర్‌కు జట్టుతో కలిసి వెళ్లాడు. అయితే అక్కడి తీవ్రమైన చల్లని వాతావరణం దూబే వెన్నునొప్పికి కారణమైంది. దీంతో వైద్య బృందం వెంటనే విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇవ్వడంతో దూబే మంగళవారం (అక్టోబర్ 14) ముంబైకి తిరిగి వచ్చినట్లు ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి.



## టీమిండియాకు కలిసొచ్చిన వర్షం

ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025లో శ్రీలంక, న్యూజిలాండ్ మహిళల జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దయింది. దీంతో ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య శ్రీలంక ఆరు వికెట్ల నష్టానికి 258 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అయితే న్యూజిలాండ్ టార్గెట్‌ను ఛేదించడం ప్రారంభించక ముందే ఆర్ ప్రేమదాస స్టేడియంలో వర్షం ప్రారంభమైంది. ఆ తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభం కాలేదు. ఈ మ్యాచ్ రిజల్ట్ టీమిండియాకు లాభాన్ని చేకూర్చింది. శ్రీలంక నాలుగు మ్యాచ్‌లలో రెండు పాయింట్లతో ఏడో స్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ మూడు పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో ఉంది. న్యూజిలాండ్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బ. ఎందుకంటే న్యూజిలాండ్ జట్టు ఇప్పటికే రెండు పరాజయాలను చవిచూసింది. ఇప్పుడు సెమీ-ఫైనల్ రేసు మరింత కష్టమైంది. మ్యాచ్ రద్దు కావడం భారత జట్టుకు మేలు చేసింది. భారత్ ఇప్పుడు గరిష్టంగా 10 పాయింట్ల వరకు చేరుకోగలదు. అయితే న్యూజిలాండ్ జట్టుకు 9 పాయింట్ల వరకు చేరుకునే అవకాశం ఉంది. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య కూడా మ్యాచ్ జరగాల్సి ఉంది. ఆ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధిస్తే సెమీఫైనల్లో స్థానం దాదాపు ఖాయం చేసుకుంటుంది.

## కోహ్లీ ఎక్కడికీ వెళ్లడు: కైఫ్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లీ గుడ్ బై చెప్పనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన కమర్షియల్ కాంట్రాక్ట్‌పై కోహ్లీ సంతకం చేయలేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఐపీఎల్ ప్లేయర్ కాంట్రాక్ట్, కమర్షియల్ కాంట్రాక్ట్ మధ్య వ్యత్యాసాన్ని వెల్లడిస్తూ కైఫ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియో చేశాడు. కోహ్లీ ఎక్కడికి వెళ్లడని, ఆర్‌సీబీలోనే కొనసాగుతాడని స్పష్టం చేశాడు. ఆర్‌సీబీ కమర్షియల్ కాంట్రాక్ట్‌పై కోహ్లీ సంతకం చేయకపోవడానికి ఓ కారణం ఉంది. ఆర్‌సీబీకి కొత్త యజమాని వచ్చే అవకాశం ఉంది. కొత్తవారి రాకతో ఫ్రాంచైజీ నిర్ణయాలు మారవచ్చు. అందుకే కోహ్లీ వేచి చూస్తున్నాడు. ఒకవేళ యజమాని మారితే.. కొత్త చర్చలు జరుగుతాయి. ఇవన్నీ తెర వెనుక జరిగే విషయాలు. వీటిపై స్పష్టమైన సమాచారం లేదు. కోహ్లీ కూడా వేచి చూస్తున్నాడు.



## ఐసీసీ టాప్ ర్యాంకింగ్స్‌లో అఫ్ఘన్ ప్లేయర్లు

అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని తిరిగి దక్కించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను అఫ్గాన్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో రషీద్ కీలకపాత్ర పోషించాడు. మంగళవారం జరిగిన మూడో వన్డేలో బంగ్లాపై అఫ్గాన్ ఏకంగా 200 పరుగుల తేడాతో గెలిచి సంచలనం సృష్టించింది. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 11 వికెట్లు పడగొట్టిన రషీద్ ఖాన్.. రెండో వన్డేలో ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఫలితంగా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు మెరుగై దక్షిణాఫ్రికా ఆటగాడు కేశవ్ మహరాజ్‌ను వెనక్కినెట్టి టాప్‌లో నిలిచాడు. ఇదే సిరీస్‌లో ఏడు వికెట్లు సాధించిన అఫ్గాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఏకంగా 19 స్థానాలు ఎగబాకి 21వ ర్యాంకులో నిలిచాడు. వన్డే కెరీర్‌లో అతడికిది బెస్ట్ ర్యాంకు.మరోవైపు, వన్డే ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో సికిందర్ రజా (జింబాబ్వే)ను వెనక్కి ఒమర్జాయ్ అగ్రస్థానం సాధించాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకుల విషయానికొస్తే.. టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాప్‌లో కొనసాగుతుండగా.. అఫ్గాన్ బ్యాటర్ ఇబ్రహీం జాద్రాన్ ఎనిమిది స్థానాలు మెరుగై రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఓ అఫ్గానిస్థాన్ బ్యాటర్ సెకండ్ ర్యాంకులో నిలవడం ఇదే మొదటిసారి. బంగ్లాపై మూడు మ్యాచ్‌ల్లో జద్రాన్ 213 రన్స్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. రెండో వన్డేలో (95), మూడో వన్డేలో (95) పరుగులు చేసి త్రుటిలో సెంచరీలు మిస్ చేసుకున్నాడు. ఇక, రోహిత్ శర్మ, బాబర్ అజామ్, విరాట్ కోహ్లీ ఒక్కో స్థానం దిగజారి వరుసగా మూడు, నాలుగు, ఐదు ర్యాంకుల్లో నిలిచారు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి టాప్-10లో ఇద్దరున్నారు. విండీస్‌పై రెండో టెస్టులో భారీ శతకం (175) బాదిన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు మెరుగై ఐదో ర్యాంకు దక్కించుకున్నాడు.

## రో-కో రిటైర్మెంట్‌పై కమిన్స్ కీలక వ్యాఖ్యలు

అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌లకు స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎంపికైన సంగతి తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీరిద్దరూ భారత్ తరఫున ఆడటం ఇదే తొలిసారి. పెర్త్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ వన్డే సిరీస్‌ను ఆసీస్ ఫాస్ట్‌బౌలర్ పాట్ కమిన్స్ ప్రత్యేకమైనదిగా అభివర్ణించాడు. కోహ్లీ, రోహిత్ శర్మ ఆటను చూడటానికి తమ దేశ ప్రజలకు ఇదే చివరి అవకాశం కావొచ్చని పేర్కొన్నాడు. వెన్నునొప్పి కారణంగా కమిన్స్ భారత్‌తో వన్డే మ్యాచ్‌లకు దూరమయ్యాడు. 'విరాట్, రోహిత్ గత 15 సంవత్సరాలుగా దాదాపు భారత్ ఆడిన ప్రతి మ్యాచ్‌లో భాగమయ్యారు. ఇక్కడ వారి ఆటను చూడటానికి ఆస్ట్రేలియా ప్రజలకు ఇదే చివరి అవకాశం కావచ్చు. కోహ్లీ, రోహిత్ భారత్ తరఫున ఆటలో ఛాంపియన్లుగా నిలిచారు. ఎల్లప్పుడూ జట్టుకు చాలా సపోర్ట్‌గా ఉంటారు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 17-10-2025 | www.evarthalu.com





పోటీభరిత సమాజంలో విద్యార్థులు ఎన్నో అవకాశాలతో పాటు న్యాయపరమైన ప్రమాదాలకూ గురవుతున్నారు. అజాగ్రత్తగా చేసిన సోషల్ మీడియా పోస్టు, చిన్న గొడవ లాంటివి ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) అనే న్యాయ పత్రంలో విద్యార్థి పేరును చేర్చే ప్రమాదం కలిగిస్తాయి. ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే అది విద్యార్థి విద్యా రికార్డు, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రతిష్టపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

# విద్యార్థి జీవితం.. ఎఫ్ఐఆర్!

### ఎఫ్.ఐ.ఆర్ అంటే ఏమిటి?

ఎఫ్.ఐ.ఆర్ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు) అనేది క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ), 1973 లోని సెక్షన్ 154 ప్రకారం నమోదు చేయబడే పత్రం. ఇది ఇప్పుడు సెక్షన్ 173 భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), 2023 చట్టంలో కొనసాగుతుంది. పోలీసులకు ఒక కాగ్నిజబుల్ ఓఫన్స్ గురించి సమాచారం అందినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు ఀ ఇది దర్యాప్తు ప్రారంభానికి మొదటి దశ. కానీ నేర నిరూపణ కాదు, ప్రాథమిక సమాచారం మాత్రమే.

### విద్యార్థులపై ఎఫ్ఐఆర్ ప్రభావం

విద్యార్థి జీవితంలో ఎఫ్ఐఆర్ ఫైల్ అయితే, అది తాత్కాలిక లేదా దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. ముఖ్యంగా భారతదేశంలో విద్యార్థులు (ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు) రాజకీయ కార్యక్రమాలు, నిరసనలు లేదా తప్పుడు ఆరోపణల వల్ల ఎఫ్ఐఆర్లకు గురవుతారు. ఇది వారి అకడమిక్, మానసిక, కెరీర్ జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. కానీ, ఎఫ్ఐఆర్ మాత్రమే జీవితాన్ని ధ్వంసం చేయదు. కోర్టు ట్రయల్, చార్జ్షీట్ లేదా కన్విక్షన్ ఆధారంగా ప్రభావం మారుతుంది. విద్యార్థులపై తప్పుడు ఎఫ్ఐఆర్లుకూడా సాధారణం అయ్యాయి. పోలీసులు లేదా అధికారులు విద్యార్థులను నియంత్రించే క్రమంలో, వారి చర్యలను అణచివేసేందుకు ఇలాంటి ప్రయోగాలు చేస్తుంటారు. అలాంటప్పుడు విద్యార్థి జీవితం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఉదాహరణకు, యూనివర్సిటీ విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నప్పుడు ఎఫ్ఐఆర్ ఫైల్ అవుతుంది. ఇది వారి డిగ్రీ పూర్తి, జాబ్ అవకాశాలను ప్రభావితం చేస్తుంది.

### ఉపాధి పరిమితులు:

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగాలలో పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి.

ఎఫ్ఐఆర్ పెండింగ్లో ఉన్నా లేదా చార్జ్షీట్ దాఖలైనా అభ్యర్థిపై అనుమానం కలుగుతుంది.

ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల సమయంలో సమస్యగా మారుతుంది.

బ్యాంకింగ్, బోధన, న్యాయ, పోలీసు శాఖల ఉద్యోగాల సమయంలోనూ ఇబ్బందులు తప్పవు.




(అవతార్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఉద్యోగం ఇచ్చే సంస్థలు.. అభ్యర్థి నేర స్వరూపం, తీవ్రతను పరిగణనలోకి తీసుకుని నియామకం చేయాలా అనే నిర్ణయం తీసుకోవచ్చు.)

### సామాజిక, మానసిక ప్రభావం:

ఎఫ్ఐఆర్ విద్యార్థికి మానసిక ఒత్తిడి, సామాజిక అపనింద, విదేశీ చదువులలో అడ్డంకులు తెస్తుంది. తల్లిదండ్రులు, సమాజం, విద్యా సంస్థల దృష్టిలో అది ప్రతికూల ముద్ర వేస్తుంది. అందుకే, ఆవేశపూరిత చర్యలకు దిగొద్దు. సోషల్ మీడియా, కళాశాల రాజకీయాలు, లేదా వ్యక్తిగత వాగ్వివాదాలు పెద్ద న్యాయ సమస్యలకు దారి తీస్తాయి.

తమ హక్కులు తెలుసుకోండి:

ఆరోపణలపై సమాచారం పొందే హక్కు (ఆర్టికల్ 22, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 48)

న్యాయవాది సలహా తీసుకునే హక్కు

బెయిల్ పొందే హక్కు (బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 479)

### న్యాయమైన విచారణకు హక్కు

తక్షణ న్యాయ సలహా తీసుకోండి:

తప్పుడు కేసు అయితే సెక్షన్ 532 బిఎన్ఎస్ఎస్ కింద ఎఫ్ఐఆర్ రద్దు పిటిషన్ వేయవచ్చు.

యాంటిసిపేటరీ బెయిల్ వినియోగించుకోండి: అరెస్టు భయం ఉంటే సెక్షన్ 482 బీఎన్ఎస్ఎస్ కింద అంటిసిపేటరీ బెయిల్ దాఖలు చేయండి.

పత్రాలు సంరక్షించుకోండి: ఎఫ్ఐఆర్, బెయిల్ ఆర్డర్, కోర్టు ఆదేశాలు అన్నీ భవిష్యత్తులో ఉపయోగపడతాయి.

పోలీసుల ముందు లేదా సోషల్ మీడియాలో తప్పును అంగీకరించకండి. ఇది మీపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.


### విచారణ ముగిసిన తర్వాత హక్కులు:

విద్యార్థి నిర్దోషిగా తేలితే లేదా కేసు క్వాష్ అయితే: ఎఫ్.ఐ.ఆర్ రికార్డులు తొలగించుకోవచ్చు, నో పెండింగ్ కేసు సర్టిఫికెట్ పొందవచ్చు, కోర్టు తీర్పును ఉపాధి దరఖాస్తులో జోడించవచ్చు

(స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ వర్సెస్ అభిజిత్ సింగ్ పవార్ కేసులో నిర్దోషిగా తేలితే ఉపాధి అర్హత తిరిగి వస్తుందిబీ కానీ ఎఫ్ఐఆర్ విషయం దాచిపెట్టడం ఉద్యోగం రద్దుకు కారణమవుతుంది అని సుప్రీం కోర్టు తెలిపింది.)



**జయపాల్ రెడ్డి**
లీగల్ అనలిస్టు, లా రిసెర్చర్




భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడంతో పాటు అఖండ భారతావనిని చీల్చి పాకిస్తాన్ ఏర్పాటు చేశారు బ్రిటిష్ వారు.. కానీ ఆ పాకిస్తాన్ ఇంకా పుట్టక ముందే దాన్ని చీల్చేందుకు కారణమయ్యాడో నాయకుడు.. బెంగాల్ ఏకమొత్తంగా తూర్పు పాకిస్తాన్ లో కలవకుండా ఉ ందంటే ఆ మహనీయుని పుణ్యమే.. ఈనాడు పశ్చిమ బెంగాల్ మన దేశంలో కొనసాగడానికి కారణం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ.

# బెంగాల్.. విభజన

నా శరీరాన్ని ముక్కలు చేయండి.. కానీ దేశ విభజన అంగీకరించబోనని మహాత్మా గాంధీ చెప్పేవారు. యుద్ధమైనా చేస్తాం కానీ దేశాన్ని ముక్కలు కానివ్వయబోమని సర్దార్ పటేల్ ధృడంగా పలికేవారు. కానీ నెహ్రూ పదవీకాంక్ష రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీ దేశ విభజన విషయంలో రాజీపడింది. పాకిస్తాన్ విషయంలో ముస్లింలీగ్ నాయకుడు మహ్మద్ అలీ జిన్నాతో రాజీపడొద్దని హిందూ మహాసభ నాయకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కాంగ్రెస్ నాయకుల చెవికి ఎక్కలేదు.. చివరకు అంతా ఊహించినట్లే దేశ విభజన అనివార్యంగా మారింది. 1946లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్ రాష్ట్రంలో ముస్లిం లీగ్ అధికారంలోకి వచ్చింది. కలకత్తా నగరం సహా బెంగాల్ మొత్తాన్ని పాకిస్తాన్ లో కలపాలంటూ ఆ పార్టీ బ్రిటిస్ వారిపై వత్తిడి తెచ్చింది. ప్రత్యక్ష చర్య పేరుతో బెంగాల్ అంతటా పెద్ద ఎత్తున మారణకాండ సాగించింది. ఒక్క కలకత్తా నగరంలోనే 10 వేల మంది హిందువులను ఊచకోత కోశారు. కలకత్తా వీధులు శవాలతో నిండిపోయాయి. మహిళలపై అత్యాచారాలు, లూఠీలు, గృహ దహనాలు పెద్ద ఎత్తున సాగాయి. బెంగాల్ పై ముస్లింలకు ఎంత హక్కు ఉందో హిందువులకూ అంతే హక్కు ఉంది. ఈ రాష్ట్రం మొత్తాన్ని ఏకపక్షంగా పాకిస్తాన్ లో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు శ్యామప్రసాద్ ముఖర్జీ.. ఇలా చేస్తే భవిష్యత్తులో ఆ దేశ భవిష్యత్తు ప్రశ్నార్ధకం అవుతుందని హెచ్చరించారు ముఖర్జీ. పెద్ద సంఖ్యలో ఉన్న హిందువులు ఉద్యమించి తూర్పు పాకిస్తాన్ (బెంగాల్)ను తిరిగి భారత దేశంలో కలుపుతారని స్పష్టం చేశారు. అసలు పాకిస్తాన్ లో బెంగాల్ అనుగడ అసాధ్యమని అని చెప్పేవారు ముఖర్జీ.. బెంగాల్ లో హిందూ ఆధిక్యత ఉన్న ప్రాంతాలను భారత దేశంలోనే కొనసాగించాలని వత్తిడి తెస్తూ పెద్ద ఎత్తున ఉ ద్యమాన్ని లేవదీశారు. హిందూ మహాసభ, బెంగాల్ హిందూ సభ మద్దతుతో శ్యామప్రసాద్ ముఖర్జీ సాగించిన ఈ తిరుగుబాటును చూసి ముస్లింలీగ్, కాంగ్రెస్ పార్టీలతో పాటు బ్రిటిష్ వరు భయపడిపోయారు. తాను విభజన వాది అంటూ చేసిన ఆరోపణలను సమర్ధవంతంగా తిప్పి కొట్టారు ముఖర్జీ.

నిజానికి బెంగాల్ విభజన అనే ఆలోచననే సాధారణ బెంగాలీలు భరించలేరు. 1905లో లార్డ్ కర్జన్ ఈ ప్రయత్నం చేసి. వందేమాతరం ఉ ద్యమంతో చేతులు కాల్చుకున్నాడు. కానీ పాకిస్తాన్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో బెంగాల్ విభజన అనివార్యంగా మారింది. బెంగాల్ లోని హిందూ ఆధిక్య ప్రాంతాలను ఇండియన్ యూనియన్ లోనే కొనసాగించాలనే డిమాండ్ తో ముఖర్జీ చేపట్టిన ఉ ద్యమం బ్రిటిష్ ప్రభుత్వంపై వత్తిడి పెరిగింది. పట్టు విడుపులు లేకపోతే పాకిస్తాన్ కలకు ఎసరు వస్తుందని భావించిన ముస్లింలీగ్ బెంగాల్ విభజనకు అంగీకరించక తప్పలేదు. కేవలం ముస్లిం ఆధిక్య ప్రాంతాలు మాత్రమే పాకిస్తాన్ (తూర్పు) పరిధిలోకి వెళ్లాయి. ముఖర్జీ చేపట్టిన ఉ ద్యమ ప్రభావంతో అటు పంజాబ్ ను కూడా ఏక మొత్తంగా పాకిస్తాన్ లో కలపలేదు.. సిక్కు, హిందూ ఆధిక్యత ఉన్న తూర్పు పంజాబ్ ను భారత దేశంలోనే కొనసాగించాలని నిర్ణయించారు. మొత్తనికి ఇలా బ్రిటిష్ వారు ఇండియాను చీల్చి పాకిస్తాన్ ఏర్పాటు చేస్తే, పుట్టక ముందు పాకిస్తాన్ ను చీల్చేశారు ముఖర్జీ.. స్వతంత్ర భారత తొలి కేంద్ర క్యాబినెట్ లో శ్యామప్రసాద్ ముఖర్జీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నెహ్రూతో ముఖర్జీ అనేవారు.. ‘ మీరు భారత దేశాన్ని ముక్కలు చేశారు. నేను పాకిస్తాన్ ను ముక్కలు చేశాను..’ అని. శ్యామ ప్రసాద్ ముఖర్జీ అన్నట్లే జరిగింది. తదనంతర కాలంలో తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్)పై పశ్చిమ పాకిస్తాన్ నాయకుల పెత్తనం భరించరానిదిగా మారింది. బెంగాల్ భాషా సంస్కృతులు కాలరాయడంతో పాటు ఇక్కడి నాయకులను అణచివేయడం మొదలైంది. చివరకు తూర్పు బెంగాల భారత దేశ సహకారంతో పాకిస్తాన్ తో యుద్ధం చేసి ‘బంగ్లాదేశ్’ గా ఆవిర్భవించింది.



**- విశ్వజిత్, ఆరెస్సెస్**

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.